విద్యా దీవెన ఆర్థిక సాయం రూ.29.50 కోట్లు

- జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ

విశాలాంధ్ర - తిరుపతి సిటీ : జగనన్న విద్యా దీవెన అక్టోబర్ డిసెంబర్ 2023 త్రైమాసికంకు చెందిన ఫీజు రీయింబర్స్మెంట్ ఆర్థిక సాయం తిరుపతి జిల్లాలో 39,368 మంది విద్యార్థులకు రూ.29.50 కోట్లు లబ్ది చేకురినట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీ శ వెల్లడించారు. సంబంధిత అధికారులు, వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనగా సీఎం జగన్ బటన్ నొక్కి నగదును జమ చేశారు. తిరుపతి కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి గాను మొదటి త్రైమాసికం (అక్టోబర్- డిసెంబర్ 2023) జగనన్న విద్యా దీవెన ఆర్థిక సాయాన్ని జిల్లాలో 39368 మంది విద్యార్థుల కు చెందిన 35502 మంది తల్లులకు చెందిన ఉమ్మడి ఖాతాలకు రూ. 29.50 కోట్లు జమ చేయడం జరిగిందని తెలిపారు. జగనన్న విద్యా దీవెన మొత్తం తల్లుల, విద్యార్థుల ఉమ్మడి ఖాతాల్లో జమ అయిన పది రోజుల్లోపు సంబంధిత కళాశాలలకు

2లో

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శనివారం 02 మార్చి 2024 8పేజీలు

మోదీ అంటే మోసం... మోసం అంటే మోదీ

జగన్, చంద్రబాబు ఇద్దరూ మోదీకి బానిసలు - 'ఇండియా'తోనే ప్రత్యేక హోదా సాధ్యం : ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలరెడ్డి

"మోదీ అంటే మోసం... మోసం అంటే మోదీ. వైసీపీ అధినేత జగన్... టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇద్దరూ నరేంద్రమోదీకి బానిసలు. ఆయనకు వంగి వంగి నమస్కారాలు పెడతారు, ఇక్కడ పులి, సింహం అని చెప్పుకునే జగన్... డిల్లీకి వెళితే పిల్లిలా మారతారు. చంద్రబాబు ఊసరవెల్లి. ఆయన ఊసర వెల్లకే పాఠాలు చెబుతారు. మోదీ, జగన్, చంద్రబాబు కారణంగానే ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా రాలేదు. 'ఇండియా' కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి మంత్రివర్గ సమావేశంలోనే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తాం, ఇది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ. ఇది ప్రత్యేక హోదా కోసం ఆరాట పడే వారికి... ప్రత్యేక హోదా తాకట్టు పెట్టే వారికి మధ్య జరుగుతున్న పోరాటం. అందుకే ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ పార్టికి అండగా నిలబడాలి" అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి కోరుకున్నారు.

వివరాలు మెయిన్‌లో , 2లో

భూ వివాదాల పరిష్కారానికే ల్యాండ్ టైట్లింగ్ చట్టం

- ముఖ్యమంత్రి సలహాదారు అజయ్ కల్లాం

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూవివాదాల పరిష్కార దిశగా ఏపి ల్యాండ్ టైట్లింగ్ చట్టం -2023 ను తీసుకొని రావడం జరిగిందని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్ తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లోని సావేరి అతిథి గృహంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పై ముఖ్యమంత్రి సలహాదారు అజయ్ కల్లాం, కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కలిసి రైతులు, రెవెన్యూ అధికారులు, అడ్వకేట్స్ , పోలీసు శాఖ వారికి ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైట్లింగ్ చట్టం -2023 పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూవివాదాల పరిష్కార దిశగా. ఎపి ల్యాండ్ టైట్లింగ్ చట్టం -

2023ను తీసుకురావడం జరిగింది అని అన్నారు. దేశం లోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో అమలు చేస్తున్న ఈ చట్టం ద్వారా భూ యాజమాన్య వివాదాలు పరిష్కరించి భూ హక్కులపై రైతులకు పూర్తి భరోసా కల్పించడం

2లో

క్రీడాస్ఫూర్తితో భక్తులకు మెరుగైన సేవలు

- టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడల ప్రారంభంలో చైర్మన్ భూమన

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగులు క్రీడాస్ఫూర్తితో శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొంది భక్తులకు మెరుగైన సేవలు అందించాలని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి కోరారు. ఉద్యోగుల వార్షిక క్రీడాపోటీలు శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గల పరేడ్ మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ సంద ర్భంగా ఈవో ధర్మారెడ్డి ఉద్యోగులతో క్రీడాప్రతిజ్ఞ చేయించారు.

2లో

మోసం అంటే మోదీ

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి నగరంలోని తారకరామ స్టేడియంలో శుక్రవారం 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా డిక్లరేషన్ పేరుతో 'న్యాయసాధన సభ' నిర్వహించారు. ఈ సభకు ప్రధాన వక్తగా వైఎస్ షర్మిల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు' అని ఇదే మైదానంలో 2014లో జరిగిన సభలో తిరుమల వెంకన్న సాక్షిగా హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక మూడు నామాల స్వామి అయిన తిరుమల వెంకన్నకే పంగనామాలు పెట్టారని ఆమె విమర్శించారు. రామ భక్తుని అని చెప్పుకునే మోదీ ఇలా మాట తప్పడం న్యాయమా అని ఆమె ప్రశ్నించారు. మోదీ ఓట్ల కోసం... రాజకీయం కోసం ప్రత్యేక హోదా అంటూ నాటకం ఆడారన్నారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే పదేళ్లుగా ప్రధానమంత్రిగా ఉన్న మోదీ ఎందుకు ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. ఢిల్లీని మించిన రాజధాని... ప్రత్యేక రైల్వే జోన్లు...కడపలో స్టీల్ ప్లాంటు.. దుగ్గిరాజుపట్నం ఓడరేవు... విశాఖ-చెన్నై కారిడార్.. రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పిన మోదీ... అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. పదేళ్లుగా ఈ హామీలు అమలు చేయలేదన్నారు. ఇక చంద్రబాబు సింగపూర్ లాంటి రాజధాని కడతామని మాట తప్పారన్నారు. జగనన్న అయితే మూడు రాజధానులు అంటూ కనీసం ఒక్క రాజధాని కట్టలేదన్నారు. జగనన్న కారణంగా ఏపీ రాజధాని లేని రాష్ట్రంగా మారిపోయిందన్నారు. పాలకుల తీరుతో దక్షిణ భారతదేశంలోనే మెట్రో సిటీ లేని రాష్ట్రంగా ఏపీ ఉండటం బాధాకరమన్నారు. ఏపీలో పాలకపక్షం, ప్రతిపక్షం ఇద్దరూ కలసి మోదీ మీద త్రిముఖ ప్రేమలో పద్దారని వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. అందుకే మోదీకి ఎదిరించకుండా ఆయన కాళ్ల వద్ద సాగిలం పడుతున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమలతో నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రత్యేక హోదాతో ఉత్తరాఖండ్ లో 2వేలు, హిమాచలప్రదేశ్ లో 10వేల పరిశ్రమలు వచ్చాయని షర్మిల ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇక జగన్ మెగా డీయస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ప్రతి యేటా జనవరిలో జాబ్ క్యాలెండరు విడుదల చేస్తామని మాట తప్పారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్ కు బుద్ధి చెప్పాలని షర్మిల పిలుపునిచ్చారు. మునుపు రాజస్థాన్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలెట్ మాట్లాడుతూ... తన తండ్రి రాజేష్ పైలట్ కు ఏపీతో ఎంతో మంచి సంబంధం ఉండేదన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ మంత్రివర్గంలో తీర్మానం చేశారని... ఆ మంత్రివర్గంలో తాను ఉన్నట్లు సచిన్ పైలెట్ గుర్తు చేశారు. అయితే నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక ఏపీకి ప్రత్యేక హోదా విషయం విస్మరించారన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి మంత్రివర్గ సమావేశంలోనే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్నారు. ఆ విషయం చెప్పడానికే తాను తిరుపతిలో నిర్వహించిన న్యాయసాధన సభకు విచ్చేసినట్లు ఆయన చెప్పారు. అంతకు మునుపు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ... రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్, సైకిల్ ను ఊరి బయటకు పంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీ రామచంద్రరావు, .జేడీ శీలం, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కనుమూరి బాపిరాజు, డాక్టర్ బత్తెయ్యనాయుడు, వేణుగోపాల్, సీపీఎం నేత గఫూర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యా దీవెన ఆర్థిక సాయం రూ.29.50 కోట్లు

(మొదటి పేజీ తరువాయి) వెల్లించి తల్లుల సహకరించాలనీ, లేనిచో తదుపరి వారి జగనన్న విద్యా దీవెన మొత్తాన్ని నేరుగా కళాశాలలకు చెల్లింపు చేస్తారని గుర్తు చేశారు. అందరు తల్లితండ్రులు తమ పిల్లలను చదివించాలని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకొని సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తయారై రాష్ట్రానికి దేశానికి సేవ చేయాలని కోరారు. అనంతరం విద్యా దీవెన కింద రూ. 29.50 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ మెగా చెక్ ను విద్యార్థులకు అందచేశారునియోజకవర్గ వారీగా లబ్ధిపొందిన విద్యార్థుల వివరాలు: చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి 6957 మంది విద్యార్థులకు చెందిన 6222 తల్లుల ఖాతాలకు రూ.5.16 కోట్లు, తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి 5203 మంది విద్యార్థులకు చెందిన 4720 తల్లుల ఖాతాలకు రూ. 4.32 కోట్లు, గూడూరు నియోజకవర్గానికి సంబంధించి 5546 మంది విద్యార్థులకు చెందిన 5032 తల్లుల ఖాతాలకు రూ.4.59 కోట్లు , నగరి నియోజకవర్గానికి సంబంధించి 2112 మంది విద్యార్థులకు చెందిన 1881 తల్లుల ఖాతాలకు రూ.1.38 కోట్లు, సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి 5011 మంది విద్యార్థులకు చెందిన 4497 తల్లుల ఖాతాలకు రూ. 3.12 కోట్లు, శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి 5983 మంది విద్యార్థులకు చెందిన 5411 తల్లుల ఖాతాలకు రూ 4.44 కోట్లు, సూళ్ళూరుపేట నియోకవర్గానికి సంబంధించి 5470 మంది విద్యార్థులకు చెందిన 4956 తల్లుల ఖాతాలకు రూ.4.26 కోట్లు, వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి 3086 మంది విద్యార్థులకు చెందిన 2783 తల్లుల ఖాతాలకు రూ.2.23 కోట్లు వెరసి సుమారు రూ.29.50 కోట్లు 35502 మంది తల్లుల ఖాతాలలో 39368 మంది విద్యార్థులకు చెందిన ఫీజు రీయింబర్స్మెంట్ నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ రెడ్డి, వివిధ కళాశాలల విద్యార్థులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో భక్తులకు మెరుగైన సేవలు

(మొదటి పేజీ తరువాయి) ముందుగా ఛైర్మన్, ఈవో కలిసి క్రీడాపతాకాన్ని ఆవిష్కరించారు. బెలూన్లు, శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఛైర్మన్ మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులకు పనిలో ఒత్తిడిని తగ్గించేందుకు, క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు ప్రతి సంవత్సరం క్రీడాపోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు పునరుత్తేజం కలుగుతుందని చెప్పారు. ఉద్యోగులకు క్రీడల పట్ల ఉన్న శ్రద్ధను గమనించి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి తమ బోర్డు రూ.10 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఉద్యోగులు మంచి ప్రతిభ కనబరిచి క్రీడల్లో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని కోరారు.టీటీడీ సంక్షేమ విభాగం డెప్యూటీ ఈఓ స్నేహలత మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, వారి మానసిక వికాసం కోసం 1977వ సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గతేడాది 829 మంది పురుషులు, 422 మంది మహిళలు పాల్గొన్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో మొదటి స్థానం గెలుచుకున్న వారికి రూ.2వేలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.1800, మూడో స్థానంలో నిలిచినవారికి రూ.1600 విలువగల బ్యాంకు గిఫ్ట్‌కార్డులు బహుమతులుగా అందజేస్తామన్నారు.ఈ సందర్భంగా ఛైర్మన్, ఈవో వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో క్రీడల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకున్న ఉద్యోగుల పేర్లు, టీమ్‌లు, పోటీ షెడ్యూల్ తదితర వివరాలు తెలియజేశారు.

భూవివాదాల పరిష్కారానికే ల్యాండ్ టైట్లింగ్ చట్టం

(మొదటి పేజీ తరువాయి)జరుగుతుందని తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యలు, మోసాలు విపరీతంగా పెరిగిపోతున్న తరుణంలో వివాదాలకు అవకాశం లేకుండా చేయడమే లక్ష్యంగా రైతులకు అవగాహన కల్పించే దిశగా మొట్టమొదటి కార్యక్రమం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు. బ్రిటిష్ వారి కాలంలో భూ రికార్డులో సక్రమంగా నిర్వహించకపోవడం ఆ రికార్డులను ఆధునికరించడంలో అనేక సమస్యలు ఏర్పడ్డాయి అని తెలిపారు. ఈ కారణం చేత భూ యాజమానులు భూమి మీద సంపూర్ణ హక్కులు భూ కోల్పోవడం జరుగుతుందని తెలిపారు. ఈ చట్టం వివిధ వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. స్వాతంత్రం అనంతరం భూ సంస్కరణలో భాగంగా ఎస్టేట్, ఇనాం వ్యవస్థ ద్వారా రైతులకు భూపత్రాలు ఇవ్వడం జరిగిందని, తదనంతరం 1989 సంవత్సరంలో ఆర్ఓఆర్ ద్వారా పాస్ బుక్, టైటిల్ డీడ్ ఇచ్చి రైతులకు హక్కు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వము రీ సర్వేలో భాగంగా ఎయిర్ క్రాఫ్ట్, రోవర్ వంటి ఆధునిక టెక్నాలజీ ద్వారా ప్రతి భూ సరిహద్దును జియో రిఫరెన్స్ చేసి రైతులకు భూ హక్కు పత్రంలను జారీ చేసే విధానాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. కావున ఈ చట్టం ద్వారా భూమిపై కచ్చితమైన టైటిలింగ్ వలన భూ యాజమాన్యానికి భద్రత పెరుగుతుందన్నారు. మొత్తం టైటిల్ రికార్డు లుసురక్షితమైన ఆన్లైన్ సిస్టం లో నిల్వ చేయబడి మొబైల్ ఫోన్లు లో రైతుల భూ సరిహద్దును చూసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి సలహాదారు కల్లామ్ మాట్లాడుతు పాత భూ రికార్డులకు స్వస్తి పలికి రైతుకు శాశ్వత హక్కులు కల్పించే దిశగా ఎ పి ల్యాండ్ టైట్లింగ్ చట్టం -2023 ను అమల్లోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. రైతులకు భూ వివాదాలను పూర్తిగా పరిష్కరించడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశంతోనే అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆధునిక టెక్నాలజీతో రికార్డులు తారుమారు కాకుండా చూడవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బన్సల్, డిఆర్ఓ పెంచల్ కిషోర్, తిరుపతి ఆర్డిఓ నిశాంత్ రెడ్డి, ఎడి సర్వేయర్ అధికారి జయరాజ్, తాసిల్దారులు, డిప్యూటీ తాసిల్దారులు, వీఆర్వోలు , విలేజ్ సర్వేయర్లు, రైతులు, బ్యాంకింగ్ అధికారులు, పోలీసు శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులపై ఎస్‌పికి వినతి

అక్రమ కేసులు బనాయిస్తున్న పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలి

టిడిపి శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జ్ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : తెదెపా నాయకులపై అక్రమంగా కేసులు బనాయించి, ముఖ్య నాయకులందరిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్న సందర్భంగా ఎస్పీని కలిసి టిడిపి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తెదెపా నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్న పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేశారు. తిరుపతి నందు తిరుపతి జిల్లా ఎస్పీని కలిసిన వివరాలు తెలియజేయడం జరిగిందని చెప్పారు. ఎస్పీ స్పందిస్తూ ఈ అక్రమ కేసులు, రౌడీషీట్ ఓపెన్ చేసే తదితర విషయాలను పారదర్శకంగా ఎంక్వయిరీ చేసి, ఏమైనా సంఘటనలో జరిగి ఉంటేనే చర్యలు తీసుకుంటామని, లేనియెడల ఎలాంటి చర్యలు తీసుకోమని హామీ ఇచ్చారని టిడిడి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గురువారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, తిరుపతి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష, పార్లమెంట్ నాయకులు చెంచయ్య నాయుడు, కంటా రమేష్, కామేష్ యాదవ్, విజయ్ కుమార్, ధనంజయనాయుడు, శ్రీకాళహస్తి ముఖ్య నాయకులు అక్రమ కేసుల బాధితులు తదితరులు పాల్గొన్నారు.

యాదవుల అభివృద్ధి తెలుగుదేశం పార్టీకే సాధ్యం

శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : యాదవులు అభివృద్ధి తెలుగుదేశం పార్టీకే సాధ్యమని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో యాదవులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాపులను రాజకీయంగా ఉన్నత స్థాయిలో నిలిపిన ఘనత బొజ్జల గోపాల కృష్ణారెడ్డి దని, ఎంతో మందిని ఉన్నత అవకాశం కల్పించి ఎన్నో పదవులు ఇచ్చారని తెలిపారు. యాదవుల అభివృద్ధి జరిగిందంటే అది ఒక తెలుగుదేశం పార్టీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తోనే అని, మరి నేడు యాదవుల పై దాడులు దౌర్జన్యాలు చేస్తూ వారిని హింసిస్తున్న ఘనత ఒక వైసీపీకే దక్కిందని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో బి సి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో రుణాలను మంజూరు చేసిన ఘనత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అని, రాబోయే ఎన్నికలలో వారి ఆశయ సాధన కోసం పనిచేస్తున్న నన్ను మీ అందరి మంచి మనసుతో ఆశీర్వదించాలని కోరారు.

సూళ్లూరుపేట నియోజకవర్గంలో కొనసాగుతున్న వైసీపీ నాయకుల రాజీనామాలు

విశాలాంధ్ర - నాయుడుపేట : సూళ్లూరుపేట నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నందు రాజీనామాల పరంపర కొనసాగుతుంది. ఇప్పటికే రఫీ,అన్నమేడు పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు రాజశేఖర్ రెడ్డి ,సునీల్ కుమార్ రెడ్డి పంచాయితీ సర్పంచ్, ఎంపీటీసీ లు రాజీనామా చేయగా శుక్రవారం మర్లపల్లి సర్పంచ్ దుప్పల విజయమ్మ, రాష్ట్ర రెడ్డి వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కట్టా సురేఖ రెడ్డి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డిలు వైఎస్ఆర్సిపి పార్టీకి రాజీనామా చేశారు, తన వ్యక్తిగత కారణాలవల్లే పార్టీకి రాజీనామా చేయాల్సి వచ్చిందని కట్టా వెంకట రమణారెడ్డి తెలియజేశారు. వెంకట రమణారెడ్డిని నియోజకవర్గ జనసేన ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్ తమ పార్టీ నేతలతో కలిసి అభినందించారు.

కామిరెడ్డి గారి పల్లెలో జగనన్న సురక్ష..

విశాలాంధ్ర - సోమల : సోమల మండలం లోని కామిరెడ్డి గారి పల్లి లో శుక్రవారంజగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచ్ శ్రీదేవి గారి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమం నందు ఎంపీపీ ఈశ్వరయ్య మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం లో ప్రభుత్వం బడుగుల కోసం ఆరోగ్యశ్రీ 25 లక్షల వరకు పెంపు చేశారని తెలిపారు. అవసరమైన వారు ఈ పథకమును వినియోగించుకోవాలని తెలియజేశారు.సీనియర్ నాయకులు అమాస మోహన్ మాట్లాడుతూ ఇంటి వద్దకే పెన్షన్లు, ప్రభుత్వ పథకాలన్నీ ఇంటి వద్దకే ప్రతి ప్రతి ఒక్కరికి ప్రతి ఇంటికి అందుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ పథకాలను అందరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేశ్వరావు ప్రభుత్వ పథకాలను వివరంగాతెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్ రావు ప్రసంగించారు. ఈ వైద్య శిబిరం నందు స్పెషలిస్ట్ డాక్టర్లు సోమశేఖర్ రెడ్డి పుష్ప కుమారి , విజయలక్ష్మి , కంటి వైద్య నిపుణులు నరసింహులు తగు సూచనలు ఇచ్చి, పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి పై ఆసుపత్రులకు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణి బాలకృష్ణ నాయుడు సచివాలయ సెక్రటరీ లోకేష్ కుమార్ గారు, దేవేంద్ర మరియు పిహెచ్సి సిబ్బంది కుమార్, రహీమ , ప్రమీలమ్మ అనసూయమ్మ ఏఎన్ఎంలు జయమ్మ భూదేవి , హిమబిందు ఎం ఎల్ హెచ్ పి లు సింధు, భావన మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ వద్ద వైసిపి నేతల ధర్నా

విశాలాంధ్ర - నాయుడుపేట : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి అధ్వర్యంలో శుక్రవారం నాయుడుపేట పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు.గురువారం అర్ధరాత్రి సమయంలో పెళ్లకూరు మండలం బంగారుపేట వద్ద సూళ్లూరుపేట వైసిపి నేతలు కలతూరు శేఖర్ రెడ్డి అతని అనుచరులతో కలిసి దళితులపై దాడిచేసి కులం పేరుతో దూషించారు అని పెళ్ళకూరు పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. శేఖర్ రెడ్డి అతని అనుచరులను వెంటనేఅరెస్టు చేయాలని కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి అధ్వర్యంలో వైసిపి నేతలు కార్యకర్తలు, దళితులు నాయుడుపేట పోలీసు స్టేషన్ వద్ద రాస్తారోకో నిర్వహించారుదీనితో గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. డీఎస్పీ, సీఐ లు భారీగా చేరుకొని సత్యనారాయణరెడ్డికి సర్దిచెప్పినఆయన మాత్రం నిందితులను అరెస్టు చేసే వరకు నిరసన కార్యక్రమం ఆగిదిలేదు అని ఖారఖడిగా చెప్పడంతో పోలీసులు ఏమి చేయాలో తెలియక నానా అవస్థలు పడ్డారు.వైసిపి పార్టీ లో నేతల మధ్య వివాదం చివరకు రోడ్డు పైకి వచ్చి నిరసనలు, కేసుల వరకు వెళిడంపైకార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

పదవీ విరమణ పొందిన జాకీర్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : పదవీ విరమణ పొందిన జాకీర్ హుస్సేన్ కమిషనర్ ఎం. రమేష్ బాబు ఘనంగా సత్కరించారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఇంజనీరింగ్ సెక్షన్ నందు పంప్ ఆపరేటర్ గా పనిచేస్తున్న జాకీర్ 29.2.2024న పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎం. రమేష్ బాబు జాకీర్‌ను ఘనంగా సత్కరించి, రిటైర్మెంట్ బెనిఫిట్ చెక్కు ను అందించి పూలమాల, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మ పోరాట సభను విజయవంతం చేయండి

బి సి వై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్

విశాలాంధ్ర - పుంగనూరు : మండలంలోని చదళ్ల గ్రామ సమీపాన ఉన్న మామిడి తోటలో ఈనెల మూడవ తేదీన అనగా ఆదివారం రోజునమూడు గంటలకు బీసీవై పార్టీ అధినేత బి రామచంద్ర యాదవ్ ధర్మ పోరాట సభ నిర్వహిస్తున్నట్లు మీడియాకు వెల్లడించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభ ద్వారా రైతులు యువత బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పలు విషయాలు ప్రజలతో మమేకమౌతూ మాట్లాడడం జరుగుతుందన్నారు అంతేగాక నియోజకవర్గ ఓనరుల రైతుల శ్రమ దోపిడీ వలసలు నిరుద్యోగాలపై ఆడపడుచుల భద్రతపై పాలకుల అరాచకాలపై చర్చించి రాజకీయ మార్పు కోసం ఈ సభ ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు నియోజవర్గ పరిధిలో ప్రజలపై జరుగుతున్న దాడులు ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్న వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకునే విధంగా ఈ సభ ద్వారా పోరాటం చేయడం జరుగుతుందని తెలియజేశారు శ్రామికులు కర్షకులు రైతులు నిరుద్యోగ యువత ముఖ్యంగా మహిళలు భారీగా ఈ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరడం జరిగింది.

6వ తరగతి ప్రవేశా నికి దరఖాస్తు లు ఆహ్వానం

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి : ఏపీ ఆదర్శ పాఠశాల కమ్మన పల్లిలో ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీ. ఎస్ . అనిత తెలిపారు. 2024 - 25 సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు లు 150/- లు 75/- రూపాయలు చెల్లించి ఈనెల 31.03.24 వ తేదీ లోపల www.cse.ap.gov.in - apms.ap. gov.in సైట్ నందు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని,ప్రవేశములు ప్రతిభ ఆధారముగా అనగా ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా మరియు రిజర్వేషన్ రూల్స్ ప్రకారము ఇవ్వబడతాయని 21.4.2024 ఆదివారం పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడునని తెలిపారు. ఇతరత్రా విషయాలకు పాఠశాలను సందర్శించాలని తెలిపారు.

పాలిటెక్నిక్, ఏ.పి.ఆర్.జే.సి. ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - తిరుపతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు, 10వ తరగతి మార్చ్/ఏప్రిల్ 2024 పరీక్షకు హాజరవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు అని,రాష్ట్ర స్థాయిలో 25 ఏప్రిల్ 2024 న ప్రవేశ పరీక్ష నిర్వాహించబడునని,దరఖాస్తు లు సమర్పించుటకు 31/03/2024 చివరి తేదీ అని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాఎఎ ఎన్.విశ్వ నాథ్ రెడ్డి తెలియ చేశారు. 2024-2025 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు ఉంటుందని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న జరుగుతుందని విశ్వం పోటి పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్ . విశ్వ నాథ్ రెడ్డి పేర్కొన్నారు.పదో తరగతి ఉత్తీర్ణత అయినా, ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8688888802/03, 9399976999 నెంబరులకు సంప్రదించ వచ్చునని తెలిపారు.

ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు

185 మంది గాను 175 మంది హాజరు

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన తిరుపతి ఆర్ఐఓ ఆఫీస్ స్కాడు

విశాలాంధ్ర - దొరవారిసత్రం : దొరవారి సత్రం మండల పరిధిలో ఉన్న మహాత్మా జ్యోతి పూలే బిసి గురుకుల పాఠశాలలో శుక్రవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ఏర్పాటుచేశారు. దొరవారి సత్రం మండల పరిధిలోని బీసీ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్ లో చదువుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న 185 మంది విద్యార్థులకు గాను 175 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు వసతులను పాఠశాల ప్రిన్సిపల్ తిరుపతయ్య ఏర్పాటు చేశారు. తిరుపతి ఆర్ ఐ ఓ నుంచి ప్రత్యేక అధికారి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ పరీక్షలు రాసిన విద్యార్థుల స్థితి గతులను పరిశీలించారు.

రాజేష్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా పని చేయండి

వైఎస్ఆర్సిపి కార్యకర్తల సమావేశంలో ఎంపీ గురుమూర్తి

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికైన నూక తోటి రాజేష్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ సమిష్టిగా పని చేయాలని తిరుపతి వైఎస్ఆర్సిపి ఎంపీ డాక్టర్ గురుమూర్తి పిలుపునిచ్చారు.శుక్రవారం బేరిశెట్టి కళ్యాణ మండపంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ముఖ్యఅతిథిగా సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూక తోటి రాజేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీని గెలిపించుకోవడానికి కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు.చిన్నపాటి విభేదాలు ఉన్న పక్కన పెట్టాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ప్రతి కార్యకర్త సైనికుడల పనిచేసే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అపార రాజకీయ అనుభవం,సౌమ్యుడు నూక తోట రాజేష్ అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఉజ్వల భవిత

జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యం

- వేంకటపతి నగర్ లో 'వై ఏపీ నీడ్స్ జగన్ ' కార్యక్రమానికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :రాష్ట్రానికి ఉజ్వల భవిత సీఎం జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతందన్నారు తుడా ఛైర్మెన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కొనసాగింపు, నిరుపేదల జీవితాల్లో వెలుగులు ఉండాలంటే వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం అధికారం లో కొనసాగాలని తెలియజేశారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం వేంకటపతి నగర్ పంచాయతీలో 'వై ఏపీ నీడ్స్ జగన్ ' కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి గజ మాలతో ఘనంగా సత్కరించిన సర్పంచ్ చిన్ని యాదవ్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు మోహిత్ రెడ్డి వైఎస్ఆర్సీపీ జెండా ఆవిష్కరణ చేశారు. యువత జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. అక్కడ నుంచి బైక్ ర్యాలీగా సభకు విచ్చేసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రజలకు వినమ్రంగా నమస్కరించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. సభా వేదికపై పంచాయతీకి చెందిన చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతి పేదవాడు గర్వంగా జీవించగలిగేలా.. రాష్ట్రంలో ప్రతి పేదవాడు గర్వంగా జీవించగలిగేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. జనరంజక పాలన రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. పారదర్శక పద్ధతులలో ప్రజలకు సంక్షేమ నిధులు అందుతున్నాయన్నారు. విద్య, వైద్యంకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పుట్టిన బిడ్డ నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్న వృద్ధుల వరకు ప్రభుత్వ పథకాలను ఏదో ఒక రూపంలో అందుకుంటున్నారని వివరించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని తెలిపారు. అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన వంటి పథకాలతో విద్యార్థుల విద్యాభ్యాసానికి భరోసా కల్పిస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చి అమలు చేయక ప్రజలకు నిర్లక్ష్యం చేసిన పార్టీని నమ్మవద్దని కోరారు. ఎమ్మెల్యే స్ఫూర్తితో ప్రజా సేవకు.. ప్రజా నాయకుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్ఫూర్తితో ప్రజా సేవకు సంకల్పిస్తానని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ మండలంలో వేంకటపతినగర్ పంచాయతీ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోందన్నారు. ఏళ్లుగా ఇళ్ల సమస్యకు పరిష్కారం నోచుకోలేదు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చొరవతో వేంకటపతినగర్ గ్రామంలో భూమిని గ్రామ కంఠంగా మార్పుకు కృషి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడిగా ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. మీకు ఎల్లప్పుడూ మీ బిడ్డలా మీకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. సీఎం వదిలిన బాణం మోహిత్ రెడ్డి అని, సైనికుల్లా మనమందరం పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా మోహిత్ రెడ్డిని గెలిపించుకుందామని సర్పంచ్ చిన్ని యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. పంచాయతీలో ఏ ఒక్క అభివృద్ధి జరిగింది అంటే.. ఒక్క ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వల్లనే అంటూ తెలియజేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందును ప్రజలు ఆస్వాదించారు. అభివృద్ధి, సంక్షేమం.. వేంకటపతి నగర్ పంచాయతీలో అభివృద్ధి పరుగులు పెట్టించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్ని యాదవ్, వైస్ సర్పంచ్ ఆర్ముగం, ఎంపీటీసీ నారాయణమ్మ, వైఎస్ఆర్సీపీ నాయకులు వీర నారాయణ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడులో ప్రశాంతంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడులో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.తొలి రోజు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు, తమిళం,హిందీ, సంస్కృతం పరీక్షలు జరిగింది. పరీక్షల చీఫ్, ప్రిన్సిపాల్ జగన్మోహన్ ఆచారి, డిపార్ట్మెంట్ అధికారి జాకీర్ హుస్సేన్ పర్యవేక్షణలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతోంది. ఇందులో భాగంగా 283 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా,275 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు అధికారులు పేర్కొన్నారు. మిగిలిన ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.పరీక్షలు రాస్తున్న ప్రతి గదికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఇంటర్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహిస్తున్నారు.ఎలాంటి మాస్కాపింగుకు తావు లేకుండా పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయుడుకి ఘనంగా వీడ్కోలు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు మండల పరిధిలోని విందూరు గ్రామంలోని గిరిజన కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నేరెళ్ల వెంకట సుబ్బారావు పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం పాఠశాల సిబ్బంది, ఎంఈఓలు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంఈఓ లు సనత్ కుమార్, కాంచనలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థులు తీర్చిదిద్ది వారి ఉన్నతికి సహకరించిన వెంకట సుబ్బారావు సేవలు వెలకట్టలేనిమన్నారు. ఆయురారోగ్యాలతో ఆయన జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విందూరు మాజీ సర్పంచ్ ఏగిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ సుధాకర్, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ

ఎమ్మెల్యే అభ్యర్థి హెలెన్

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నారాయణవనం మండలంలో, సముదాయం గ్రామంలో నారాయణవనం మండల పార్టీ అధ్యక్షుడు పి గిరి బాబు అధ్యక్షతన బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ డోర్ టు డోర్ క్యాంపెనింగ్ కార్యక్రమం పాల్గొన్నా సత్యవేడు నియోజకవర్గం ఇంచార్జి %d%ఎమ్మెల్యే అభ్యర్థి డా. హెలెన్ మరియు సత్యవేడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే హేమలత ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జ్ షణ్ముగం,నియోజకవర్గ బీసీ సెల్ అధికార ప్రతినిధి పొన్ను స్వామి,వేల్ రెడ్డి,కృష్ణారెడ్డి,ఈశ్వర్ రెడ్డి,ముని వేలు,ఏకే లత,లత, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు వైకాపాకు రాజీనామా

టిడిపిలోకి ఆహ్వానించిన పాశం

విశాలాంధ్ర-కోట: దొరువు కట్ట గ్రామానికి చెందిన వైకాపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చిల్లకూరు దశరథ రామిరెడ్డి శుక్రవారం వైసీపీకి రాజీనామా చేశారు.ఈ క్రమంలో ఆయనతో పాటు అనుచరులు,ఎంపీటీసీ శశి, వంజివాక సర్పంచ్ ఆదెమ్మ,పుచ్చలపల్లి సర్పంచ్ గోవర్ధన్ రెడ్డిలు వైసీపీ పార్టీకి రాజీనామా చేశారు.దీంతో ఆయన నివాసం వద్ద పండుగ వాతావరణం నెలకొంది బాణాసంచా వేడుకలతో ఆయన అనుచరులు సంబరాలు చేసుకున్నారు,తెలుగుదేశం పార్టీ గూడూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఆయన నివాసానికి చేరుకొని పూలమాలలు శాలువాలతో సత్కరించి తెలుగుదేశం పార్టీలోకి ఆయనను ఆహ్వానించారు.ఈసందర్భంగా పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ శనివారం వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని,ముందుగా కోట మండలం నాయకులతో కలిసి తెలుగుదేశం పార్టీలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని అన్నారు. దశరథరామిరెడ్డి తెలుగుదేశం పార్టీలోకి రావడంతో కోట మండలంలో పార్టీకి మరింత బలం చేకూరిందని అన్నారు. వైసీపీ పార్టీలో గౌరవం లేకపోవడంతో తెలుగుదేశం పార్టీలోకి రావడం ఆనందంగా ఉందని అన్నారు. దశరథ రామిరెడ్డి రాకతో సునామీ మొదలైందని అన్నారు.రేపటినుండి కోట మండల తెలుగుదేశం పార్టీ పెద్దగా దశరథరామిరెడ్డి వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దాలి సర్వోత్తమ్ రెడ్డి,ఎస్.కే.జలీల్ భాషా,మధు యాదవ్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి నా బిడ్డను ఆదరించండి: చెవిరెడ్డి లక్ష్మి

విశాలాంధ్ర -పాకాల : పాకాల మండలంలో జరిగిన అభివృద్ధిని చూసే తన కుమారుడు చెవి రెడ్డి మోహిత్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేసి ఆదరించాలని చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి ప్రజలకు తెలిపారు. శుక్రవారం పాకాల మండలంలోని ఇ .పాలగుట్ట పల్లి గ్రామపంచాయతీలో చెవి రెడ్డి లక్ష్మి గడపగడపకు మహా పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను వివరించారు. వై కాపా ప్రభుత్వ పాలనలో తన భర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎమ్మెల్యేగా గ్రామాలలో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్ర భవనాలు, స్మశానాల అభివృద్ధి , మినరల్ వాటర్ ప్లాంట్ ల ఏర్పాటు, సిమెంట్ రోడ్లు వంటి అనేక అభివృద్ధి పనులు చేశాడని గుర్తు చేశారు . వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేసి చూపిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే రావడం ఖాయం

వైయస్సార్ ఆసరా చెక్కులు పంపిణీలో ఎంపీ డాక్టర్ గురుమూర్తి

విశాలాంధ్ర- సత్యవేడు:రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి రావడం ఖాయమని తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గురుమూర్తి స్పష్టం చేశారు.శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ముఖ్యఅతిథిగా సత్యవేడు నియోజకవర్గం వైయస్ఆర్సీపీ సమన్వయకర్త నూక తోటి రాజేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ప్రతి పేద వాళ్లకు మేలు జరగాలన్న,సంక్షేమ పథకాల లబ్ధి చేరాలన్న వైఎస్ఆర్ పార్టీ అధికారంలోకి రావాల్సి ఉందన్నారు. అందువల్ల మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుందామని ఆయన చెప్పారు. నూకతోటి రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందిస్తూ ఐదేళ్లలో సాగిన జగనన్న విప్లాత్మక పరిపాలన దేశంలోనే ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు.పేదలకు ఇలాంటి సంక్షేమ పథకాలు అందాలన్నా ,వైసిపి తిరుపు చారిత్రక అవసరం అన్నారు సత్తివేడు నియోజకవర్గం ఏర్పడి ఎంత పెద్ద ఎత్తున ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడం జగనన్న పరిపాలనలోనే జరిగిందన్నారు.చంద్రబాబు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మకుండా జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై ముద్రించి తమను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.కాగా మండలంలోని 977 స్వయం సహాయక సంఘాలకు రూ. 9,27,00,000 లు వైయస్సార్ ఆసరా పథకంలో ప్రభుత్వం సొమ్ము జమ చేసినట్లు వైయస్సార్ క్రాంతి పథం ఏపీఎం స్వర్ణలత పేర్కొన్నారు. అంతకు ముందు డ్వాక్రా సంఘాల మహిళలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈకార్యక్రమంలో జడ్పిటిసి విజయలక్ష్మి,సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏఎంసి బాలాజీ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నిరంజన్ రెడ్డి,ఎంపీడీవో చంద్రశేఖర్, వైయస్సార్ క్రాంతి పథం ఏపిఎం స్వర్ణలత,వైయస్సార్ క్రాంతి పథం కోఆర్డినేటర్ పయని, సంఘమిత్రలు, పలువురు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎ, బి రెండు సెంటర్లు అలాగే ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎ,బి రెండు సెంటర్లు మొత్తం నాలుగు సెంటర్లలో పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తెలుగు,తమిళం,హిందీ, సంస్కృతం పరీక్షలు జరిగాయి. పరీక్షల చీఫ్ లు గా బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారాయుడులు వ్యవహరించారు. ఇందులో భాగంగా నాలుగు సెంటర్లలో కలిపి 1882 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 1859 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు అధికారులు పేర్కొన్నారు. మిగిలిన 23 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. పరీక్ష కేంద్రాలలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఇంటర్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఎలాంటి మాస్కాపింగుకు తావు లేకుండా ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఎ ఎస్ ఐ గుర్రప్ప ఆధ్వర్యంలో బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బందోబస్తుకు వచ్చిన పోలీసులకు కనీసం నిర్వాహకులు నీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారికి కేటాయించిన స్థానం ఒదిలి బయటకు వెళ్లలేని పరిస్థితి. ఓ పక్క విద్యార్థులు పరీక్ష ఆవరణలో పరీక్ష రాస్తుంటే వారి తల్లిదండ్రులు మండుటెండలో వారి పిల్లలు కోసం బయట వేచి ఉండటం గమనార్హం.

తొలిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ఐదు కేంద్రాలలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులను తల్లిదండ్రులు పరీక్షా కేంద్రానికి తీసుకువచ్చారు. సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రానికి అనుమతించారు. ఎక్కడ ఇటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని వసతులు ఏర్పాటు చేశారు. విద్యార్థులు వారికి కేటాయించిన గదులను నోటీస్ బోర్డ్ పై చూసుకుని పరీక్షలు రాసేందుకు కేటాయించిన గదులలోకి వెళ్లారు.

వైఎస్ఆర్ ఆసరాతో పేదింట వెలుగులు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పలమనేరు : వైయస్ఆర్ ఆసరాతో పొదుపు మహిళలకు బాసటగా నిలిచి పేదింట వెలుగులను నింపిన ఏకైక సీఎం మన వైయస్ జగన్మోహన్‌రెడ్డి అని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.వెం కటేగౌడ అన్నారు. మండలంలోని మొరం పంచాయతీ లో నిర్వహించిన వైయస్ఆర్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే,బాలాజీ సూపర్ బజార్ కమిటీ అధ్యక్షుడు ఆర్ వి సుభాష్ చంద్రబోస్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. చంద్ర బాబు పొదుపు రుణమాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చి మోసం చేశారని చెప్పారు. అందువల్లే మహిళల ఆశీర్వాదం జగనన్నకే ఉందన్నారు. బాబుకు ఎన్ని కల్లో ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదని చెప్పారు. వచ్చే ఎన్నికలు పేదలు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్నట్లు తెలిపారు. పేదలు సీఎం వైయస్ జగన్ పక్షాన ఉంటే.. పెత్తందార్లు చంద్రబాబు పక్షాన ఉన్నారని తెలిపారు. నా ద్వారా మేలు జరిగి ఉంటేనే ఓటు వేయ మని వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుతుంటే బాబు మాత్రం డబ్బులిచ్చి ఓట్లు కొనాలని వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా కులం,మతం, ప్రాంతం చూడం అని చెప్పాం. ఆ విధంగానే ఇచ్చిన మాట ప్రకారం 4 విడతల్లో బ్యాంకులకు మీ మీ రుణాలను చెల్లిస్తాం అని చెప్పాం. నాలుగో విడత చెల్లించేందుకు ఈ రోజు మనమంతా ఇక్కడ సమావేశం నిర్వహించటం జరిగిందన్నారు. అనంతరం రూరల్ మండలంకు సంబంధించి వై ఎస్ ఆర్ ఆసరా పథకము నాల్గవ విడత మంజూరైన నిధులు పంపిణీ" లబ్ధిదారులైన మహిళలకు మెగా చెక్కును పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎం పి డి ఓ విద్యాసాగర్,ఎపియం మొగిలీశ్వర ,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి,ఎంపిపి రోజా, జడ్‌పిటిసి మల్లిక రంగనాథ్, రూరల్ మండలం కన్వీనర్ బాలాజీ నాయుడు,సర్పంచులు సంఘం మండల అధ్యక్షుడు విశ్వనాథ్ రెడ్డి, సర్పంచులు జగన్ మోహన్ రెడ్డి, బాలాజీ నాయుడు, మునస్వామి, గోవిందస్వామి , రూరల్ మండల వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు

ఐసిడిఎస్ అర్బన్‌లో ఫార్మాలిటీస్ పేరుతో వేధింపులు

చీర, సారె, స్వీటు, నగదు సమర్పించాల్సిందే
బట్టబయలైన వాస్తవాలు, పరస్పరం ఆరోపణలు
గుట్టు చప్పుడు కాకుండా బదిలీలు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు అర్బన్ కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్లకు, కార్యకర్తలకు ఫార్మాలిటీస్ వేధింపులు తప్పలేదు. ఈ విషయం గుట్టు చప్పుడు కాకుండా ఇంటిగుట్టు బయటపడకుండా ఏళ్ల తరబడి సాగుతూనే ఉంది. ఫార్మాలిటీ వ్యవహారంలో తలెత్తిన విభేదాలు కార్యాలయంలో వివాదాలు రేపాయి. కార్యాలయ అధికారికి మరో మహిళా ఉద్యోగికి మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నట్లు సమాచారం. తప్పెందుకు చేశావని ప్రశ్నించిన అధికారిని, ఆ తప్పులో మీకు వాటా ఇచ్చాను కదా అని మహిళా ఉద్యోగులతో పాటు ఆమె భర్త కూడా కార్యాలయ అధికారిపై దురుసుగా ప్రవర్తించారని తెలిసింది. దీంతో అవినీతి తంతు ఎక్కడ బయటపడుతుందోనని గుట్టు చప్పుడు కాకుండా ఆ మహిళ ఉద్యోగితోపాటు డ్రైవర్ ను కూడా మరో ప్రాంతానికి బదిలీ చేసినట్లు సమాచారం. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు, వర్కర్లు ఊపిరి పీల్చుకున్నారు. విజిట్ల సమయంలో అక్కడక్కడ బయటపడ్డ లోపాలను ఆసరాగా చేసుకుని గూడూరు అర్బన్ ఐసిడిఎస్ కార్యాలయంలో ఉన్న మహిళా ఉద్యోగి వేధింపులు ఎక్కువయ్యాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా అందినట్లు సమాచారం. దీంతో ఎక్కడ అసలు విషయం బయటపడకుండా ఉద్యోగులను బదిలీ చేసి జిల్లా స్థాయి అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

ఐతేపల్లి పంచాయితీలో పర్యటించిన పులివర్తి వినీల్

విశాలాంధ్ర - చంద్రగిరి: మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థి పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. తెదేపా మినీ మేనిఫెస్టో లోని పథకాలను వినీల్ ప్రజలకు వివరించారు. చంద్రగిరి మండలం, ఐతేపల్లి పంచాయితీలో పులిత్తివారిపల్లి గ్రామం గంగమ్మ గుడి వద్ద నుండి"మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని", "బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ" కార్యక్రమంలో చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినీల్ కు జనసేన, టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఇంటి ఇంటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గురించి వివరించారు. మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ, సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ,జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అనుబంధ సంస్థ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీ ఫామ్ రానిపక్షంలో

ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధం

యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షులు దేగా రవిరాఘవేంద్ర

విశాలాంధ్ర - గూడూరు : తిరుపతి పార్లమెంటు అభ్యర్థిగా కాని పక్షంలో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షులు దేగా రవి రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం ఆయన గూడూరులోని యునైటెడ్ ఫోరం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యునైటెడ్ ఫోరం తరపున ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామ న్నారు. ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాలోని వందల గ్రామాల్లో రథ చైతన్య యాత్రలను మూడు నెలలపాటు నిర్విరామంగా నిర్వహించి ప్రజలకు రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించామ న్నారు. సమాజంలో విద్యతోనే అసమానతలు దూరమవుతాయని భావించి ఐటిఐ కళాశాలను స్థాపించి విద్యా రంగంలో కూడా కొన్నేళ్లుగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ప్రజాభీష్టం, యునైటెడ్ ఫోరం సభ్యుల సూచనలతో ప్రజా సేవ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు సిద్ధమయ్యానన్నారు. మతం పేరుతో వర్ఖం గడుపుకునే పార్టీలకు వ్యతిరేకంగా దేశంలో లౌకికవాదం, ప్రజా స్వామ్యవాదాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవడం అనివార్యమన్నారు. అందుకే తొలి ప్రాధాన్యత ఎంపీగా బరిలోకి దిగాలని భావిస్తున్నామన్నారు. ఒకవేళ కుదరని పక్షంలో గూడూరు నియోజకవర్గం నుండి అసెంబ్లీ ఎన్నికలలో పోటీకి సిద్ధమన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున బీ ఫామ్ రానిపక్షంలో ఇండిపెండెంట్ గా నైనా పోటీకి సిద్ధమన్నారు. ప్రజల ఆశీస్సులు తనకు కచ్చితంగా ఉంటాయన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల సదస్సుకు తరలిన నాయకులు

విశాలాంధ్ర - గూడూరు : తిరుపతిలో పీసీసీ చీఫ్ వైఎస్ఆర్ తనయురాలు షర్మిల విచ్చేయనున్న ఎన్నికల సభకు హాజరయ్యేందుకు శుక్రవారం గూడూరు నుండి ఆ పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిమళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ పాలనలో దేశంలో అభివృద్ధి శూన్యమన్నారు. దళితులు, మైనారిటీలపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. , ప్రశ్నించే మేధావులు, అభ్యుదయ వాదులపై దేశ ద్రోహం కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి చమరగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం తిరుపతి సభకు బయల్దేరి వెళ్లారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కార్వేటినగరం ఎస్ఐగా వెంకటకృష్ణ

విశాలాంధ్ర-కార్వేటినగరం: ఎన్నికల్లో బదిలీల్లో భాగంగా కార్వేటినగరం ఎస్.ఐగా వెంకటకృష్ణ శుక్రవారం పదవీబాధ్యతలను చేపట్టారు. ఈయన చిత్తూరు వీఆర్ నుంచి కార్వేటినగరం పోలీస్ స్టేషన్కు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.ఐ. దస్తగిరి సీఐగా పదోన్నతిపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్.ఐ మాట్లాడుతూ రానున్న 2024 ఎన్నికలను పగడ్బందీగా నిర్వహిస్తానని, దీనికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు పూర్తిగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే కార్వేటినగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బంది ఎస్.ఐకి శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు.

ఉద్యోగ,ఉపాదిపై అవగాహనా కార్యక్రమం

విశాలాంధ్ర-చౌడేపల్లి:మండలం లోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయం లో నేడు డి.ఆర్.డి.ఏ పథక సంచాలకులు తులసీ ఆదేశానుసారం ,ఏ.పి.యం.నర్సోత్తమరెడ్డి పరివేక్షణలో ఉచిత శిక్షణ,ఉద్యోగ,ఉపాధి అవకాశాల పై అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ఈ సందర్భముగా నర్సోత్తమ రెడ్డి మాట్లాడుతూ మండలం లోని 18 సంవత్సరాలు నిండిన 28 సంవత్సరాలు మధ్యగల నిరుద్యోగ యువతీ ,యువకుల కు ఉచిత,ఉపాధి,ఉద్యోగ శిక్షణ పై అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.కావున నిరుద్యోగ యువతీ,యువకులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,పాల్గొనదలచిన వారు విద్యార్హత సర్టిఫికెట్లతో వెలుగు కార్యాలయం లో సంప్రదించాలని,పూర్తి వివరాలకు జె.రెడ్డెమ్మ జాబ్స్ కో-ఆర్డినేటర్ 9676180056 ను సంప్రదించాలని ఆయన అన్నారు.

అప్పులు బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర -సూళ్లూరుపేట : సులూరుపేట లోని బాపూజీ కాలనీలోని బాలాజీ నగర్ నందు నివాసముంటున్న మర్రి నాగేశ్వరరావు,(58) అప్పుల బాధ తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సూళ్లూరుపేటలో చోటుచేసుకుంది. సులూరుపేట ఎస్సై రహీం రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ మరి నాగేశ్వరరావు తను నివాసం ఉంటున్న ఇల్లుని 73 లక్షల రూపాయలకి ఆమె వేశాడని 52 లక్షల రూపాయలు అడ్వాన్సు తీసుకొని ఇల్లు కొనుగోలు చేసిన వ్యక్తులకు శుక్రవారం రిజిస్ట్రేషన్ చేయలేకపోవడంతో, బ్యాంకులో ఉన్న ఇంటిలోనూ పూర్తవకపోవడంతో ఇల్లు కొనుగోలు చేసిన వ్యక్తులకి రిజిస్ట్రేషన్ చేయలేకపోయాము అని మనస్తాపం చెంది ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

జెడ్పీ చైర్మన్ చే అభివృద్ధి పనుల సమీక్ష

విశాలాంధ్ర - గంగవరం : గంగవరం మండల పరిషత్ కార్యాలయం నందు ప్రభుత్వం నుండి అమలవుతున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పై చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ జి.శ్రీనివాసులు ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించి, పలు అంశాలపై అధికారులకు శుక్రవారం పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ నిధుల నుండి మేలుమాయి పంచాయతీ మర్రిమాకుల పల్లి గ్రామం నందు బోర్ వెల్ కొరకు రూ.2.50 లక్షల మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రజా ప్రతినిధులకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రప్ప, చలపతిరెడ్డి, శ్రీరాములు రెడ్డి, గిరి రాజా రెడ్డి, నాగేంద్ర రెడ్డి, వినోద్ రెడ్డి, అధికారులు ఈఓఆర్డీ తిరుమల గోపాల ప్రసాద్, ఎంఇఒ-2 శ్రీనివాసులు, ఏపీఓ మురుగేష్, వెలుగు సిసి బాలు, తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యం: డిఆర్డిఏ పిడి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలలో భాగంగా వై.యస్.ఆర్.ఆసరా, వై.యస్.ఆర్.చేయూత లబ్ధి దారులలో వారి ఆసక్తి కలిగిన జీవనోపాధుల ఏర్పాటు చేసుకొనుటకు దీనితోపాటు బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి ఋణాలు అనుసంధానం చేసి వారి సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యంగా ప్రతి సిబ్బంది పనిచేయాలని డి.ఆర్.డి.ఏ.-ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతి తెలిపారు. శుక్రవారం ఉదయం శ్రీకాళహస్తి మండలంలోని వెలుగు కార్యాలయంలో పరిసర 10 మండలాలకు చెందిన వై.యస్.ఆర్.క్రాంతి పథం ఏపియం లు, సిసి లు, అకౌంటెంట్ లు రివ్యూ సమావేశానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని రివ్యూ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలలో భాగంగా వై.యస్.ఆర్.ఆసరా, వై.యస్. ఆర్.చేయూత లబ్ధి దారులలో వారి ఆసక్తి కలిగిన జీవనోపాధుల ఏర్పాటు చేసుకొనుటకు దీనితోపాటు బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి ఋణాలు అనుసంధానం చేసి వారి సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యంగా ప్రతి సిబ్బంది పనిచేయాలని, చిరు వ్యాపారులు సక్రమంగా తిరిగి చెల్లించిన వారికి మళ్లీ జగనన్న తోడు ఋణాలు ఇప్పించాలని తెలిపారు. లోకోస్ యాప్ నందు సంఘాలు ప్రొఫైల్ నమోదు చేయడంలో జిల్లా ఇంకా 40 శాతం లోపు మాత్రమే ఉందని, ఇందులో శ్రీకాళహస్తి మండలం మాత్రమే 85శాతం పూర్తి చేశారని చెప్పారు. మిగిలిన మండలాలు కూడా ఈ నెల ఆఖరి లోపు 100 శాతం పూర్తి చేయాలని కోరారు. అలాగే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గ్రామీణ పేదరిక తగ్గింపు ప్రణాళికలో ఇప్పటి వరకు శ్రీకాళహస్తి, రామచంద్రాపురం మండలాలు మాత్రమే 100 శాతం పూర్తి చేశారని, మిగిలిన మండలాలు వారం లోపు పూర్తి చేయాలని తెలియ జేశారు. ఏపిడి ప్రభావతి మాట్లాడుతూ ప్రతి మండలంలో మహిళా రైతు సంఘాలు ఏర్పాటు చేసి రైతు ఉత్పత్తి దారులు సమాఖ్య ఏర్పాటు, రిజిస్ట్రేషన్ ఈ నెల ఆఖరి లోపు పూర్తి చేయాలని, కాని ఇప్పటి వరకు శ్రీకాళహస్తి మండలం వారు మాత్రమే పూర్తి చేసి డి.సి.ఓ.కి సబ్మిట్ చేశారని, మిగిలిన మండలాలు వారు త్వరగా చేయాలని కోరారు. ఉన్నతి ఋణాలు, సిఐయఫ్ రికవరీ 100 శాతం రావాలని, గ్రామ జల సంఘం పెండింగ్ అకౌంట్స్ త్వరగా ఓపెన్ చేయాలని తెలియ జేశారు. స్త్రీ నిధి ఏజియం హేమంత్ కుమార్ మాట్లా డుతూ స్త్రీ నిధి ద్వారా సంఘాలు కు విరివిగా ఋణాలు ఇస్తున్నామని, ప్రతి మండలంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఋణం పొందేలా చర్యలు తీసుకో వాలని, అలాగే 100 శాతం రికవరీ చేయించాలని తెలియ జేశారు. ఈ రివ్యూ సమావేశంలో ఐబి డిపియం మాధవి, ఫైనాన్స్ డిపియం వెంకటేష్, చేయూత డిపియం వనజాక్ష, జెండర్ డిపియం విజయ, శ్రీకాళహస్తి మండలం ఏపియం మునెయ్య, ఉన్నతి, జీవనోపాధులు, బ్యాంక్ లింకేజి ఏపియంలు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, కె.వి.బి.పురం, వరదయ్యపాలెం, డక్కిలి, బాలయ్యపల్లి, వెంకటగిరి, నారాయణవనం, బి.యన్.కండ్రిగ మండలాలు సిబ్బంది పాల్గొన్నారు.

పోలియోపై అవగాహన శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర - గంగాధర నెల్లూరు: మార్చి 3 న నిర్వహించే పోలియోపై అవగాహన శిక్షణ కార్యక్రమం శుక్రవారం గంగాధర నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు నిర్వహించారు . ఈ అవగాహన కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఆశాలు అంగన్వాడీ టీచర్లు ఎం ఎల్ హెచ్ పి లు పాల్గొని ర్యాలీ నిర్వహించారు.ఈ పల్స్ పోలియో కార్యక్రమంలో పురిటి పిల్లల నుండి ఐదు సంవత్సరాల లోపల పిల్లలకు ఈ పోలియో డ్రాప్స్ ని తల్లిదండ్రులు విధిగా ఈ రెండు చుక్కలను వేయించి తమ పిల్లల భవిష్యత్తును కాపాడుకోవాలని డాక్టర్ ప్రవీణ్ కోరారు . గంగాధర నెల్లూరు మండలంలో 3616 పిల్లలకు పోలియో చుక్కలు వేయాలంటున్నారు.గంగాధర నెల్లూరు మండలంలో 26 పోలియో కేంద్రాలను, రెండు ట్రాన్సిట్ పాయింట్ పెడుతున్నామని అందులో ఒకటి తానా సర్కిల్ నందు రెండవది తులసి మెడికల్ షాప్ ముందు నిర్వహిస్తామన్నారు ఒక మొబైల్ కేంద్రం నిర్వహిస్తామన్నారు ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్, సిహెచ్ఓ శ్రీనివాసులు, మరియు ఏఎన్ఎం లు ఆశాలు ఎంఎల్ హెచ్ పి లు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అమర్నాథ్ రెడ్డి కి ఘన స్వాగతం

విశాలాంధ్ర - పలమనేరు:పట్టణంలోని కొత్తపేటలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన మాజీ మంత్రి ఎన్. అమర నాథ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రంగాపురంలో చాక్లెట్లతో భారీ గజమాలతో ఆయనకు నాయకులు స్వాగతం తెలియజేశారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. పట్టణంలో అడుగడుగునా పట్టణ ప్రజలు నీరాజనలు పలికారు.అనంతరం పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని ఎల్. బీ.నగర్, రంగాపురం, యం.సీ. పాళ్యం , ఎద్దుల సంత వీది, గంగమ్మ గుడి వీధి, బలరాం శెట్టి వీది, ఎంబీటి రోడ్డు నందు "బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ - ఇంటింటికీ తెలుగుదేశం"కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. పలమనేరు లోని నూతనంగా పార్లిశామిక వాడలో గల పల్లె రుచులు హోటల్ వద్ద మొట్టమొదటి ఎలక్ట్రిక్ చార్జ్ జోన్ ను మాజీ మంత్రి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నాయకుల ఆర్వీ బాలాజీ.. పట్టణ నాయకులు ఆర్బీసి కుట్టి, గిరిబాబు, సుబ్రమణ్యం గౌడ్, ఖాజా పీర్, చాంద్బాషా, నాగరాజు, మదన్, శ్రీధర్,చిన్ని, శ్రీనివాసులు, లోకేష్,వీరప్ప,విజయ్, రోషన్ లతోపాటు జనసేన నాయకులు దిలీప్, చైతన్య, నాగరాజు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించిన వాలంటీర్

విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీపేట గ్రామానికి చెందిన రామయ్య కొనాళ్ళుగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి బరుడు ఆస్పత్రిలో చికిత్స పొంతున్నాడు. మార్చి 1వ తేదీ కావడంతో పింఛన్ అందించేందుకు వలంటీరు ఆషాజ్యోతి తిరుపతికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా రామయ్య మట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో సీఎం జగనన్న సాటి లేరని ఆయనే మా కుటుబానికి పెద్దదిక్కని, ఎప్పటికీ ఆయనుకు రుణపడి ఉంటాం అన్నారు.-కొల్లాగుంట నుంచి చిత్తూరుకు వెళ్లి మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామానికి చెందిన వనిత ముక్కు శస్త్రచికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమాచారాన్ని అందుకున్న వలంటీర్ భార్గవి చిత్తూరుకు వెళ్లి పింఛన్ అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారు వనిత మాట్లాడుతూ మా లాంటి పేదలకు అండగా నిలుస్తూ ఆర్థికంగా కంటికి రెప్పలా కాపాడుకుంటున్న సీఎం జగనన్నకు మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు.తిరుపతికి వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఆషాజ్యోతి

విద్యార్థి దశ నుండే స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ కలిగి ఉండాలి

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్ : పుత్తూర్ గేల్స్ హై స్కూల్ నందు హెడ్ మిస్ట్రెస్ ఏ భువనేశ్వరి నూతనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ యందు గైడ్స్ యూనిట్ 3 యూనిట్లను నూతనంగా ఆర్. నాగరత్నమ్మ, ఎం. సునీత బి .రెడ్డి రాణి ముగ్గురు ఉపాధ్యాయులను నియమించి ఒక్కొక్క ఉపాధ్యాయురాలు యూనిట్ నందు 32 మంది చొప్పున 96 మంది విద్యార్థులను మూడు గైడ్ యూనిట్లుగా ఏర్పాటు చేసి విద్యార్థుల యందు అవగాహన కల్పిస్తూ ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఈ శిక్షణలో విద్యార్థి యొక్క ముఖ్యంగా ఆధ్యాత్మిక విలువలను తెలుసుకుంటూ శారీరక మానసిక ఒర్పు సహనాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ వెంకటేశ్వర్లు విద్యార్థులకు గైడ్స్ సంబంధించిన శిక్షణ తరగతులపై తెలియ పరుస్తూ స్కౌట్స్ అండ్ గైడ్స్ పైన ప్రత్యేక అవగాహనను కల్పించారు మరియు సీనియర్ గైడ్స్ లీడర్స్ చారులత, దీపిక గీతిక సీనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర - వి.కోట : యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండల కేంద్రంలోని కట్టకాల్వ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బైరెడ్డిపల్లి మండలం చంద్రమాకులగడ్డ గ్రామానికి చెందిన రాజు (22) కూలిపని చేసుకుని జీవించేవాడు రాజుకు మూడు సంవత్సరాల క్రితం భాను అనే మహిళ తో వివాహమైంది. కాగా ఒక వారం క్రితం ధనలక్ష్మి అనే మహిళ తో మరొక వివాహం జరిగినట్లు తెలుస్తోంది. కారణం తెలియదు కానీ రాజు తను నివాసం ఉంటున్న ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సురుటుపల్లి ఆలయంలో
కన్నుల పండుగగా ధ్వజారోహణం

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీపల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతోంది.ఇందులో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆలయంలో కన్నుల పండుగగా ధ్వజారోహణం శాస్త్రోత్తంగా నిర్వహించారు.ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో కార్య నిర్వహణఅధికారి కోటి రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో ధ్వజారోహణ ప్రక్రియ కొనసాగింది.ఈ నేపథ్యంలో ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ధోజారోహణ ప్రక్రియ మధ్యాహ్నం 12:00 వరకు జరిగింది.ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేసన్ ఆధ్వర్యంలో అర్చకులు రుద్ర మూర్తి,గణేష్, సుబ్బారావు, సతీష్,లోకనాథం,తదితరుల బృందం ధ్వజస్తంభాన్ని పాలు,పెరుగు, తేనె వంటి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.అగ్ని,గాలి వంటి పంచభూతాలుగా ధ్వజస్తంనికి అన్నం ప్రసాదంగా నైవేద్యం సమర్పించారు.అనంతరం త్రిశూల దమరుక స్వరూపాలుగా నందీశ్వరుని చిత్రపటాన్ని ధ్వజస్తం శిఖరాణ ప్రతిష్ట కావించారు. తదనంతరం ధ్వజస్తం చుట్టూ దర్భను చుట్టిన తర్వాత మహాదేపా రాధన జరిగింది.ఈ క్రమంలో సాయంత్రం నాలుగు గంటల

సమయంలో విఘ్నేశ్వరుడు,త్రిశూలం, సోమస్కందుడు,అమ్మవారు,వల్లి దేవ సమేత సుబ్రమణ్య స్వామి వారికి కంకణ ధారణ చేయనున్నారు. కాగా శివరాత్రి మహెూత్సవంలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం ఐదు గంటలకు పంచమూర్తి అభిషేకం,10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తి అభిషేకం, సాయంత్రం నాలుగు గంటల నుంచి 5:30 వరకు యాగశాల పూజ,పూర్ణాహుతి నిర్వహించారు.రాత్రి 7:00 సమయంలో పల్లకి వాహనంపై ఉత్సవమూర్తి స్వామికి వివిధ పుష్పా లతో అర్చన చేసి మహాదేపారాధన తర్వాత సురుటుపల్లి పురవీధుల్లో మాడ వీధుల గుండా ఊరేగారు.ఆలయంలో శుక్రవారం నిర్వహిస్తున్న వివిధ పూజా కార్యక్రమాలు,పల్లకి వాహనంపై స్వామి వారి ఊరేగిం పుకు సంబంధించి ఉభయ దారులుగా పిచ్చాటూరు మండలానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ జయచంద్ర నాయుడు వ్యవహరిస్తున్నారు. ఆలయంలో సందర్శించే భక్తులందరికీ తీర్థ ప్రసాదాల పంపిణీ జరుగుతోంది.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండల సభ్యులు మంజుల ఉమాపతి,ఆనందుడు,ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి రోజు అత్యంత వైభవంగా లక్ష కుంకుమార్చన

విశాలాంధ్ర-చౌడేపల్లి : మండలం లోని దిగువపల్లిలో వేంచేసియున్న బోయకొండ గంగమ్మ దేవస్థానంలో ఆలయ చైర్మన్ నాగరాజ రెడ్డి ఆద్వర్యములో ఆఖరి రోజు అత్యంత వైభవముగా లక్ష కుంకుమార్చన కార్యక్రమము నిర్వహించ డము జరిగినది. సదరు లక్ష కుంకుమార్చన కార్యక్రమములో ఉభయదారులుగా 167 మంది దంపతులు పాల్గొని వారి అభీష్టసిద్ధి కొరకు పూజ చేసి అమ్మవారి కృపకు పాత్రులు అయినారు. పుంగనూరు మండల పరిషత్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి దంపతులు పూజల యందు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనమునకు విచ్చేసిన ఉభయదారులకు మరియు భక్తాదులకు ఉచిత అన్నదానము చేయడ˘ము జరిగినది. వీరికి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసా దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు రజని,రామదాస్, భారతి,రాజేశ్, బుడ్డమ్మ,యస్.పవన్ కుమార్, యన్ భాస్కర్ రెడ్డి, సి.లక్ష్మిదేవమ్మ,కె.హైమావతి,డి.రెడ్డెప్ప, దేవస్థాన కార్యని ర్వహణాధికారి చంద్రమౌళి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దలవాయి చెరువులో చేపల కొరకు వేలం పాట ..

విశాలాంధ్ర - సోమల :సోమల మండలంలోని పొదల కుంట పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల దళ వాయి చెరువు లో గల చేపల కొరకు 1433 పసలి ప్రకారం పై అధికారులు ఆదేశాల మేరకు గ్రామ సచివాలయంలో 4.3.24వ తేదీ సోమవారం ఉదయం 11 గం.లకు సర్పంచ్ జయరామ్ మరియు మండల అభివృద్ధి అధికారి సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని కార్యదర్శి.జయరాం ఓ ప్రకటన లో తెలిపారు. వేలం పాటలో పాల్గొను వారు ప్రభుత్వ నిబంధనల మేరకు కార్యాలయంలోని అధికారులను సంప్రదించవల యునని తెలిపారు.

మాదిగ అమరవీరులకు ఘన నివాళులు

విశాలాంధ్ర - సోమల : సోమల బస్టాండ్ కూడలిలోమాదిగ అమర వీరులకు ఘన నివాళి అర్పించిన ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ గత 30 సం.గా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఏ.బి.సి.డి వర్గీకరణ పోరుబాటలో అసువులు బాసిన అమరవీరుల వారి త్యాగాలకు మాదిగ జాతి ఎప్పుడు రుణపడి ఉంటుందని జాతి కోసం ప్రాణాల ర్పించి అమరవీరులయ్యారు. అసువులు బాసిన అమరవీరులు అను కున్న వర్గీకరణ జరగనుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం.ఆర్. పి.ఎస్. మండల అధ్యక్షులు ప్రభు కుమార్ ఎం.ఎస్.పి. మండ లాధ్యక్షులు పి.జయప్రకాష్ సీనియర్ నాయకులు మొగిలేశ్వర ఎం.ఎస్.పి. సీనియర్ నాయకుడు తోట లక్ష్మీపతి మాజీ మండలా ధ్యక్షులు ఎర్రబెల్లి రవి నియోజకవర్గ యువసేన అధ్యక్షులు సుధా కర్,వడ్డిపల్లివెంకటరామయ్య లక్ష్మీ దేవమ్మ రమణ మనీ పాల్గొన్నారు

క్షేత్రస్థాయిలో ఏపీ మాస్ సంస్థ ప్రతినిధులు అధ్యయనం

విశాలాంధ్ర -చిత్తూరు: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రామ సమాఖ్యలు ,రైతు ఉత్పత్తిదారుల సంస్థల పనితీరుపై ఏపీ మాస్ సంస్థ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం బంగారు పాల్యం మండలంలో మాస్ సంస్థ ప్రతినిధులైన గంగాధర్, ప్రహల్లాద, రైతు ఉత్పత్తిదారుల సంస్థ, మండల సమాఖ్య ల పనితీరును స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థను ఎలా కొనసాగిస్తారు, అంతిమ లక్ష్యం ఏంటి, ఆర్థిక లావాదేవీలు ఎలా కొనసాగుతాయి. దీని వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సిబ్బంది , వ్యవసాయ అను బంధ శాఖల పాత్ర ఎలా ఉంది. ఎలాంటి వ్యాపార కార్యక్రమాలు కొనసాగిస్తారు, లాభం ఎలా వస్తాయి ,వచ్చే లాభాలను ఎలా టర్నోవర్ చేస్తారు అన్న అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. అలాగే మండల సమాఖ్య ఏర్పాటు ఆర్థిక లావాదేవీలు స్వయం సహాయక సంఘాలను ఎలా బలోపేతం చేస్తున్నారు. రికార్డులను ఎలా తయారు చేస్తున్నారు అన్న అంశాల ఆరా తీశారు. అనంతరం రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు, గ్రామ సమాఖ్య సభ్యులచే ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని పలు అంశాలపై ఆరా తీశారు. చిత్తూరు జిల్లాలో డిఆర్డిఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైతు ఉత్పత్తిదారుల సంస్థ గ్రామ సమాఖ్య లు సమర్థవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో దీనిపై క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్న లక్ష్యంతో బంగారుపాళ్యానికి రావడం జరిగిందని మాస్ సంస్థ ప్రతినిధులు తెలిపారు . ఈ కార్యక్రమంలో డిపిఎం వెంకటేష్ ,ఐబీ ప్రకాష్, ఏజీఎం సూరి ,ఏపీఎం శంకర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ, గ్రామ సమాఖ్యల ప్రతినిధులు, ఏపీఎంలు సీసీలు పాల్గొన్నారు.

చౌడేపల్లి నూతన యస్సైగా ప్రతాప్ రెడ్డి

విశాలాంధ్ర-చౌడేపల్లి : మండలంలో నూతన యస్సై గా ప్రతాప్ రెడ్డి భాధ్యతలు చేపట్టారు.ఇతను గతం లో పలమనేరు సబ్ డివిజన్ పరిధిలో గంగవరం సర్కిల్ గంగవరం పోలీస్టేషన్ లో యస్సై గా విధులు నిర్వర్తిస్తూ, బదిలీ పై ఇక్కడకు వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా - ఆర్డర్ కు విఘాతం కల్పించే వారిపై ఉక్కుపాదం మోపుతామని, అసాంఘిక కార్యక్రమాల పై ప్రత్యేక దృష్టి సాధిస్తామని,ట్రాఫిక్ అంతరాయాలు కలుగకుండా చూస్తామని,మీ పరిసర ప్రాంతాలలో అసాంఘిక కార్యక్రమాల వివరాలు మా దృష్టికి తేవాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెల్పారు.

బాదితునికి పెన్షన్ అందజేత

విశాలాంధ్ర - సోమల :సోమల మండలం పొదల కుంట పల్లి పంచాయతీ కి చేరిన సుబ్రహ్మణ్యం గత కొద్దిరోజుల క్రితం ప్రమాదంలో కాలు విరగగా ఆయన ను తిరుపతి లో ఓ ప్రైవేటు వైద్యశాల లో ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ విజయవంతం గా వైద్యులు పూర్తి చేశారు.అనంతరం ఆయన విశ్రాంతి కొరకు తిరుపతి లోని కుమారుని ఇంటి వద్ద ఉండగా మార్చి 1 వతేది పెన్షన్ అందజేయాల్సిఉండగా ఎం.పిటిసి నాగభూషణం రెడ్డి మరియు గ్రామ వాలాంటర్ దేవి తిరు పతి లోని సుబ్రహ్మణ్యం ఇంటి వద్దకు చేరుకొని పింఛను అందజేశారు.ఈ క్రమంలో లబ్ధిదారుడు మా గ్రామంలో నేను లేకున్నా ,తిరుపతికి వచ్చి పింఛన్ అందజేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అలాగే రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

వైసీపీ పాలనలో 8 సార్లు పెరిగిన కరెంటు చార్జీలు

మరమగ్గ కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తాం

- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : ఎన్నికలకు ముందు అధికారంలోకి రావడానికి మోసపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక జగన్మోహన్ రెడ్డి 8 సార్లు కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారని నగరి నియోజకవర్గం తెలుగుదేశం జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి, గాలి భాను ప్రకాష్ అన్నారు నగరి మున్సిపాలిటీ 17వ వార్డు వినాయకపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గాలి భాను ప్రకాష్ ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. టీడీపీ - జనసేన పార్టీల ఉమ్మడి మ్యానిఫెస్టో కరపత్రాలు, అలాగే జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ముద్రించిన కర పత్రాలను ప్రజలకు అందచేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మరమగ్గ కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని చంద్రబాబు గారు హామీ ఇచ్చారని, తప్పనిసరగా అమలు చేసి ఆదుకుంటామని పేర్కొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావాల్సింది హంగులు, ఆర్భాటాలు కాదని, శాశ్వత అభివృద్ధి కావాలన్నారు. నాశనమైన రాష్ట్రం మళ్లీ యదాస్థితికి చేరుకోవాలనానగరి పట్టణంలో శాశ్వత అభివృద్ధి పనులు జరగాలన్నా అది తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. 2024లో జగన్ పతనం ఖాయమని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని అన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర -చిత్తూరు : సుప్రీంకోర్టు ఉత్తర్వులు, రాష్ట్ర హైకోర్టు సూచనలు మేరకు ఈ నెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కరుణ్ కుమార్ తెలిపారు.శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా భవనం నందు ఈ నెల 16 న జిల్లా లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ పై మీడియా సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలు, రాష్ట్ర హైకోర్టు సూచనలు మేరకు జిల్లాలో ఈ నెల 16 న జిల్లా కేంద్రం తో పాటుగా 13 మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని వివరించారు. జాతీయ లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశం మామూలుగా కోర్టులలో తీర్పు చెప్పినప్పుడు ఒకరు విజయం సాధిస్తే మరొక్కరు అపజయ అవుతారని, దీనికి విభిన్నమైన రీతిలో లోక్ అదాలత్ లో కక్ష దారులు మధ్య వర్తిత్వం ద్వారా మాట్లాడుకోవడం తో వివాదన్ని సున్నితంగా పరిష్కారం చేసుకోవడం జరుగుతుందన్నారు. రాజ్యాంగం ప్రజలకు కల్పిస్తున్న సమ న్యాయం, సామాజిక న్యాయం, సత్వర న్యాయం కోసం సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో కక్ష దారులకు సత్వర న్యాయం అందించుటకు లోక్ అదాలత్ ను నిర్వహించడం జరుగుతుందన్నారు.

నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్సై పి. శ్రీనివాసరావ్

విశాలాంధ్ర- గుడిపాల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యం లో బదిలీ పై కాణిపాకం నుండి చిత్తూరు జిల్లా గుడిపాల ఎస్సై గా పి. శ్రీనివాసరావ్ ఈ రోజు బాధ్యతలు చేపట్టారు. ఎస్సై పి. శ్రీనివాసరావ్ గుడిపాల ఏ ఎస్సై మునివేలు, సిబ్బంది కలసి ఘనస్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు, ఎస్సై పి. శ్రీనివాసరావ్ తమ కార్యాలయ సిబ్బంది తో మాట్లా డుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తానని తెలిపారు, సార్వత్రిక ఎన్నికల నేపథ్యం సిబ్బంది అందరూ తమ విధులు నిస్పక్షపాతం గా నిర్వర్తించాలని తమకు అందరు సహకరించాలని తెలిపారు , బదిలీపై గుడిపాల మండల ఎస్సై గా విచ్చేయడం ఆనందకరమన్నారు, క్షేత్రస్థాయి సమస్యలను వీలైనంతవరకు పరిష్కారం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందు బాటులో ఉంటానన్నారు, శాంతి భద్రతలను కాపాడుతానాని విధులను నిస్పక్షపాతం గా నిర్వర్తిస్తానని తెలిపారు, అనంతరం మీడియా తో మాట్లాడుతూ తమ విధులకు అందరు సహకరించాలని కోరారు.

సరస్వతి శిశుమందిరంలో సామూహిక జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - గూడూరు : శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డీఆర్ యూసీసీ మెంబర్ రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ శ్యామసుందరరావు యాదవ్ దాతృత్వంతో శ్రీ సరస్వతీ శిశు మందిరంలో పేద విద్యార్థులకు సామూహిక జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఐదు మంది విద్యార్థులతో భారీ కేక్ ను కట్ చేయించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమాలకు ఆ దేవ దేవుడు శ్రీ కృష్ణ పరమాత్మ ఆశీస్సులు, మా తల్లిదండ్రులు వనమ్మ , కృష్ణయ్య దీవెనలతో పాటు మయూరి స్వీట్స్ వనజా కృష్ణ కల్యాణ మండపం, సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మయూరి శ్యామ్ యాదవ్, ఆచార్యులు రంగనాయకులు, మురళీ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, సనత్ కుమార్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి పెళ్ళికానుక పంపిణీ

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండలం లోని ఇరంగారి పల్లి గ్రామపంచాయతీ శ్రీనివాస నగర్ కు చెందిన బాబు ప్రసాద్ , జీఎం సత్య లకు చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి , తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి లు శుక్రవారంపెళ్లి కానుకను అందించారు. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో వివాహం చేసుకునే నూతన వధూవరులకు చెవిరెడ్డి కుటుంబ సభ్యులు పెళ్ళికానుక అందిస్తున్నారు. ఇందులో భాగంగా త్వరలో వివాహం చేసుకోనున్న బాబు ప్రసాద్ ,జీఎం సత్య లకు శ్రీవారి లడ్డు ప్రసాదం, బంగారు తాళిబొట్టు ,మెట్టెలు ,నూతన వస్త్రాలు, బాసికాలు,వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ ముద్రించిన గ్రీటింగ్ కార్డులను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి , తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి లు పంపించారు. వీరు పంపిన పెళ్లి కానుకను ఎంపీటీసీ కస్తూరి వధూవరుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు డాక్టర్ శివకుమార్ ,వెంకటేష్ , నాగరాజు, లక్ష్మితదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

విశాలాంధ్ర- పాకాల : పాకాల పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణను జిల్లా ఎస్పీ మల్లికా గర్గ్ సస్పెండ్ చేసినట్లు సిఐ రాజగోపాల్ తెలిపారు. లక్ష్మీనారాయణ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించి గురువారం మద్యం సేవించి డ్యూటీకి హాజరవడం తోపాటు సహోద్యోగితో గొడవపడటంతో ఈ సంఘటనపై శుక్రవారం ఎస్పీ మల్లికా గర్గ్ విచారణ జరిపి ఈ నిర్ణయం తీసుకున్నారు.

యువత టీడీపీలో చేరిక

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు రెండవ పట్టణం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన వైసీపీ యువతను, నాయకులు రావూరు సురేంద్ర, దానం శ్యామ్ బాబుల ఆధ్వర్యంలో 60 మంది యువతను శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో మాజీ శాసన సభ్యులు, నియోజకవర్గ అభ్యర్థి పాశం సునీల్ కుమార్ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారం చేపట్టి అందరినీ మోసం చేసిందన్నారు. యువతకు ఉద్యోగ క్యాలండర్ విడుదల చేస్తామని మోసపు మాటలు చెప్పిందన్నారు. యువతకు మంచి భవిష్యత్తు కావాలంటే చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలన్నారు. యువత టీడీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆర్. ప్రదీప్, ఎం. వంశీ, హరి, శ్రీనంద, వెంకీ, లోకేష్, శ్రీనివాసులు, హర్ష, యస్వంత్, వినయ్, శ్రీను, రాజేష్, ప్రణయ్, నవీన్, ఈశ్వర్, అఖిల్ తదితరులను కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు,జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య,మస్తాన్ నాయుడు, టి ఇశ్రాయేలు కుమార్, ఎండీ. అబ్దుల్ రహీమ్, కోటేశ్వరరావు, శివకుమార్, నాగేశ్వరావు, స్థానిక గాంధీనగర్ నాయకులు ఏసుపాక పెంచలయ్య, వాటంబేటి శివకుమార్, బట్టేపాటి కృష్ణయ్య, శ్రీపాదం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలలో టీడీపీ కే ఓటెయ్యండి

విశాలాంధ్ర - పాకాల : రాబోయే అసెంబ్లీ ఎన్నికల లో టిడిపికి ఓటు వేసి పులివర్తి నానిని ఎమ్మెల్యేగా గెలిపించాలని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ పులివర్తి నాని సోదరి ధనలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పాకాల మండలంలోని శంఖంపల్లి గ్రామపంచాయతీలో ధనలక్ష్మి ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె టిడిపి జనసేన నాయకులతో కలిసి ఇంటి ఇంటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గురించి వివరించారు. మిని మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురౌతున్నా చర్యలు శూన్యం

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : వరదయ్యపాలెం మండలంలోనిపాండూరు రెవిన్యూ పరిధిలో 915 .5 సర్వే నెంలో 4.76 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ఇందులోనే 2.7సెంట్లు స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల కు కేటాయించారు. పిల్లలు లేనందున ఆ పాఠశాలను మూతపడింది. ఈ స్థలంలోనే ప్రస్తుతం 40లక్షల రూ" ప్రభుత్వ నిధులతో గ్రామ సచివాలయం నిర్మించారు. దీని పక్కనే ఆర్బికే భవనం నిర్మించాల్సి ఉంది.అయితే ఈ సచివాలయం కు దారిలేకుండా ఓ రైతు, ఇదంతా తన భూమి అంటూ దున్నేశాడు. సచివాలయ సిబ్బంది, ప్రజలు , రైతులు సచివాలయానికి వెళ్ళి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు ఉన్నాయి.కాగా గత కొన్నేళ్ళ క్రితం 915-5 లో 1.70 సెంట్లు ను అప్పటి రిటైర్డ్ ఎమ్మార్వో పుల్లయ్య, మునిరాజ భార్య జయలక్ష్మి పేరు మీద పట్టా మంజూరు చేసినట్లు నకిలీ పట్టాను రూపొందించుకున్నారు.గ్రామస్తులు ఇక్కడి ప్రభుత్వ భూఆక్రమణలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేయగా, జాయింట్ కలెక్టర్ ఆ పట్టాను రద్దు చేశారు.ఎమ్మార్వో వివరణతో సిసిఎల్ విచారణలో ఆ పట్టా చెల్లదనే చెప్పారు. హైకోర్ట్ మొదటి బెంచ్ లో కూడా ఇదే సమాధానం ఎదురైంది.కానీ హైకోర్ట్ దిగువ బెంచ్ లో ఈ పట్టాకు సంబంధించి విచారణ నడుస్తోంది, అందుకు ప్రస్తుత రెవిన్యూ అధికారులు వివరణ రాసి పంపాల్సి ఉన్నా , వారు మీనమేషాలు లెక్కిస్తుండటంతోనే ఇక్కడ భూ సమస్యలు అధికమవుతున్న పరిస్థితి ఉంది.ఈ నేపధ్యంలో ఇదే గ్రామానికి చెందిన మునిరాజ అనే వ్యక్తి సచివాలయం ముందున్న ప్రభుత్వ భూమిని, పాఠశాల భూమిని, ఆఖరికి పనికి ఆహారం పథకం క్రింద వేంకటేశ్వర గిరిజన కాలనీకి వేసిన రోడ్డును కూడా తనదేనంటూ ఆక్రమణకు గురిచేసేశారు.ఈ గ్రామంలోని పక్కాపట్టా కలిగిన మరో నలుగురు రైతులకు సంబంధించిన 1.50 సెంట్లు భూమిని కూడా ఆక్రమణ కు గురి చేసినట్లు తెలుస్తుంది.రెవిన్యూ శాఖలో మూడుపుల మాయాజాలం, సచివాలయానికి శఠకోపం మారిందని, గిరిజన వాడ దారిని మాయం చేసిందని బాహాటంగానే ప్రజలు చర్చించుకుంటున్నారు.చేయి తడిపితే చాలు, ఏ భూమి అయినా పట్టా చిట్టాలు మారిపోవాల్సిందే అన్నంతగా ఇక్కడ రెవిన్యూ లీలలు సాగుతున్నాయనే సమాచారం.ప్రధానంగా అధికార పార్టీ నేతల అండదండలతోనే ఇక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమణలు సమస్యగా మారుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి పాండూరులో ప్రభుత్వ భూముల ఆక్రమణలు సమస్యగా మారుతున్న క్రమంలో రెవిన్యూ అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై విచారణ జరిపి తగు విధంగా ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, గ్రామస్తుల మొర ఆలకించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర - గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల పరిధిలోని పెద్ద కాలువ పంచాయతీ చెర్లో పల్లి వద్ద ఈనెల 26 న రాత్రి గుర్తు తెలియని వ్యక్తి హత్యగావించబడ్డాడు. ఈ హత్య కేసును గంటల వ్యవధిలో పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి డిఎస్పి రాజగోపాల్ రెడ్డి గంగాధర్ నెల్లూరు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన మురుగన్ (47) ను అతని స్నేహితులు నాగరాజు బాలాజీ ఇద్దరూ కలిసి ముందస్తు ప్రణాళిక ప్రకారం మద్యం సేవించి హత్య చేశారని తెలిపారు. మురుగన్ నాగరాజు బాలాజీ ముగ్గురు స్నేహితులని, మురుగన్ నాగరాజు దగ్గర 40,000 అప్పు తీసుకున్నాడని, తిరిగి చెల్లించమని అడిగే క్రమంలో నాగరాజు భార్య పై అసభ్య పదజాలంతో మాట్లాడటం వలన మురుగన్ పై కక్ష పెంచుకొని అతన్ని చంపాలి అని నిర్ణయించుకున్నాడని, తన స్నేహితుడైన బాలాజీ సహాయం కోరి పథకం పన్ని చంపాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. తద్వారా బెంగళూరు నుండి మురుగన్ నాగరాజు బాలాజీ చిత్తూరు తిరుత్తని రోడ్డు పక్కన గల సుధాకర నాయుడు బీడు భూమి కొచ్చి మృతుడి తో కలిసి మద్యం సేవించి మృతుడు మద్యం మత్తులో ఉండగా అతని ముందే తెచ్చుకున్న సుత్తితో మృతి తలపై ముఖంపై విచక్షణారహితంగా దాడి చేసి బలమైన గాయాలు కలుగజేసి హత్య చేసినాడు అని నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా నాగరాజు బాలాజీ చెన్నై, బెంగళూరు హైవే పక్కన బాలా త్రిపుర సుందరి కళ్యాణ మండపం వద్ద అనుమానాస్పదంగా ఉండగా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపడమైనదని తెలిపారు. ఈ కేసును గంగాధర నెల్లూరు సిఐ శంకర్ , తాలూకా సిఐ కుల్లాయప్ప ,ఎస్సైలు రామాంజనేయులు, ఉమామహేశ్వర్ రెడ్డి ,సుబ్బమ్మ తో పాటు ఐడి పార్టీ సిబ్బంది సుధాకర్ , రాజ్ కుమార్ ఛేదించారని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ తరపున పనిచేస్తాం

పలమనేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శివశంకర్

విశాలాంధ్ర - పలమనేరు : పల్లె పట్నం తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీ తరపున తన శక్తి వంచన లేకుండా పనిచేస్తానని పలమనేరు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి శివశంకర్ తెలిపారు.పలమనేరు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ శివశంకర్ అధ్వర్యంలోనియోజక వర్గం నుండి తిరుపతి లో జరుగనున్న ప్రత్యేక హోదా సాధన సభకు కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా ఏర్పాటు చేసిన బస్సులలో వేలాదిమంది బయలు దేరి వెళ్ళారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ. ప్రారంభించారు.గంగవరం మండలం నల్లగుట్లపల్లె గ్రామంలోరైతు కుటుంబం నుంచి వచ్చి ఈరోజు ఆ దేవుడు ఆశీర్వాదం వలన ఉన్నత స్థాయిలో వున్నాననని. రాష్ట్ర స్థాయి.మరియు నియోజక వర్గ నాయకులు ఆశీస్సులు కావాలనిఆయన కోరారు. రానున్న 2024ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ప్రజలు నామీద నమ్మకం పెట్టి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయనకోరారు.తిరుపతిలో జరుగునున్నప్రత్యేక హోదా సభకు కర్ణాటక రాష్ట్రంకోలార్ ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్సోదరుడు కొత్తూరు వెంకట్రమణ హాజరై జెండా ఊపి బస్సులను సందర్భంగా మాట్లాడుతూ.... నా తమ్ముడు శివశంకర్ కు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలమనేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఫైరోజ్ ,పెద్దపంజాణి మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు దొరస్వామి. వికోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, సనావుల్లా,తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి, ఖాళీ జాగా బకాయి పన్నుల పై వడ్డీ మాఫీ

మున్సిపల్ కమిషనర్ ఎం. రమేష్ బాబు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఆస్తి పన్ను, ఖాళీ జాగా పన్నులపై ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయి పన్నులు చెల్లించిన వారికి బకాయిలపై వడ్డీ మాఫీ చేయబడిందని, ఈ అవకాశాన్ని పన్ను బకాయిదారులు వినియోగించుకోవాలని శ్రీకాళహస్తి పురపాలకసంఘ కమిషనర్ ఎం. రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జి. ఓ. ఎం. యస్. నెం. 35, ఎం. ఏ.అండ్ యు.డి తేది. 29-02-2024 ఉత్తర్వుల మేరకు పురపాలక సంఘంలో ఆస్తి, ఖాళీ జాగా పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు వున్న మొత్తము అసలు, పాత బకాయిలు వన్ టైమ్ మెజర్ (ఏక మొత్తములో) పన్నులు చెల్లించిన వారికి ఆస్తి పన్నుపై వున్న వడ్డీ మొత్తము మాఫీ చేయడము జరుగుతుందన్నారు. కావున పట్టణ ప్రజలు మార్చి 31 లోపు ఆస్తి, ఖాళీ జాగా పన్నులను చెల్లించినట్లైతేనే ఆస్తి పన్నుపై పూర్తిగా వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని, కావున, ఆస్తి పన్ను చెల్లింపుదారులు, ఈ యొక్క సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వడ్డీ మినహాయింపు లబ్ధిని పొంది మీ యొక్క ఆస్తి, ఖాళీ జాగా పన్ను బకాయిలని వడ్డీ లేకుండా ఒకేసారి (ఏక మొత్తములో) మార్చి 31 లోపు పన్నులు చెల్లించవలసినదిగా మునిసిపల్ కమిషనరు ఎం. రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు.

శానంబట్లలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కి అపూర్వ స్వాగతం

విశాలాంధ్ర - చంద్రగిరి: ప్రతి ఇంటా సీఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో లబ్ధి, చెవిరెడ్డి చేసిన మేలు ఎప్పటికి మరచిపోలేం, జగనన్నే ఎప్పటికీ మా సీఎం, చెవిరెడ్డి మోహిత్ రెడ్డే మా ఎమ్మెల్యే అంటూ శానంబట్ల గ్రామస్థులు యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి హామీ ఇచ్చారు. చంద్రగిరి మండలం శానంబట్ల పంచాయితీ గ్రామాలు కొత్తశానంబట్ల, దళితవాడ, పాత శానంబట్ల, అరుందతీవాడ, శివగిరి, కట్టమీద ఇండ్లు గ్రామాలలో ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులిచ్చారు. స్థానిక వైఎస్ఆర్పి నాయకులు ఘనంగా స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. అనంతరం యువ నాయకుడు హర్షిత్ రెడ్డి సీఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జడ్పిటిసి యుగంధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అరగొండ వనజ చంద్రశేఖర్, సర్పంచ్ యశోద శంకర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పసల నాగరాజు, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బియ్యం లేక లబో దిబో మంటున్న ప్రజలు

విశాలాంధ్ర-చౌడేపల్లి : మండలం లోని చారాల గ్రామ పంచాయతీ రేషన్ షాపు నెంబర్ 33 నందు దాదాపు 120 కార్డులున్నాయి.ఐతే మొదటి రోజు నిత్యవసర సరుకులు దాదాపు 40-50 కార్డులకు ఇచ్చారు.అప్పుడే బియ్యం అయిపోయాయి అనడం తో ప్రజలు నిరాశ చెందారు.ప్రతినెలా ఇదేతంతు జరగడం తో ప్రజలు కోపం తో రేషన్ డీలర్ అశోక్ పై గొడవకు దిగారు.ఈ విషయం పై గ్రామస్తులు స్థానిక గ్రామ రెవిన్యూ అధికారి చరవాణి లో సంప్రదించగా ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.కావున సదరు రేషన్ షాపు డీలర్ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుచున్నారు.

జిల్లాలో జగనన్న విద్యా దీవెన నిధులు జమ: జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర -చిత్తూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై. యస్. జగన్ మోహన్ రెడ్డి అక్టోబర్ డిసెంబర్, 2023 త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన నిధులును అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేశారని జిల్లా కలెక్టర్ ఎస్. షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి కృష్ణా జిల్లా పామర్రు నుండి అక్టోబర్ - డిసెంబర్, 2023 త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన నిధులను కంప్యూటరు లో బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేశారు. చిత్తూరు జిల్లా సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు ఎన్.రెడ్డప్ప, జెడ్ పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఎస్.సి, ఎస్.టి, బిసి, ఈబిసి, కాపు, మైనారిటీ క్రిస్టియన్ మైనారిటీకి చెందిన అర్హులైన ఐటిటి, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఫార్మసీ అన్ని డిగ్రీ కోర్సు విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా పూర్తి ఫీజ్ రీయింబర్స్మెంట్ అందించడం జరుగుతున్నదని తెలిపారు. ఫీజు రీయింబర్స్మెంట్ కు సంబంధించి నగదు ను విద్యార్థుల తల్లుల ఖాతాలకు ముఖ్యమంత్రి నేరుగా జమ చేస్తున్నారన్నారు. జిల్లాలో అక్టోబర్ డిసెంబర్, 2023 త్రైమాసికానికి 32,427 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ 29,407 మంది తల్లుల ఖాతాలకు రూ.20,54,29,471 జమ కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు నగర మేయర్ అముద, డిఆర్ఓ బి.పుల్లయ్య, జెడ్పి వైస్ చైర్ పర్సన్ రమ్య, జిల్లా సాంఘీక బిసి, గిరిజన శాఖల అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీ భాష, మూర్తి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ కార్డుల ముద్రణపై రాష్ట్ర అధికారుల సమీక్ష

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా విజయవాడ చీఫ్ ఎలక్టోరల్ అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం ఓటర్ కార్డుల ముద్రణ, పంపిణీ స్థితిపై సమీక్షించారు. ఇందులో భాగంగా ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో తిరుపతి నుంచి జిల్లా ఎన్నికల అధికారి హెూదాలో కలెక్టర్ డాక్టర్ లక్ష్మి శ పాల్గొన్నారు. పెండింగ్ ఫామ్ ల పురోగతి, తొలగింపులు, శిక్షణా కార్యక్రమాలు, ఫిర్యాదులు, ప్రతి కూల వార్తలు, డిఈఎంపి, జిల్లా కంట్రోల్ రూమ్/సోషల్ మీడియా సెల్ ఏర్పాటు, ఫిర్యాదు నిర్వహణ వ్యవస్థ/ నివేదిక నిర్వహణ వ్యవస్థ, ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీల నుండి జిల్లా నోడల్ అధికారుల నియామకం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి జెసి శుభం బన్సల్, తిరుపతి ఈఆర్ఓ అదితి సింగ్ తదితరులు కూడా హాజరయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత పై చేపడుతున్న చర్యలపై వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఈఆర్ఓ లకు పలు సూచనలు చేస్తూ మాట్లాడుతూ బిఎల్వో లకు ఈవీఎం ట్రైనింగ్, ఎంసిసి తదితర ట్రైనింగ్ లు షెడ్యుల్ మేరకు పూర్తి కావాలని అన్నారు. పెండింగ్ క్లెయిమ్ లపై త్వరితగతిన ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో 5 నాటికి కనీస వసతులు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తి చేసి నివేదిక పంపాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఈఆర్ఓ లు కిరణ్ కుమార్, నిశాంత్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, చంద్ర ముని, రామ్మోహన్, కోదండ రామిరెడ్డి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్ర శేఖర్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ : కమిషనర్

విశాలాంధ్ర –చిత్తూరు : 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలం పన్నులపై వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు నగర కమిషనర్ అరుణ ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీ మాఫీ ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొందన్నారు. బకాయిల మొత్తాన్ని మార్చి 31 తేదీలోగా చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు ఉంటుందన్నారు. ఇప్పటికే వడ్డీతో కలిపి పన్ను చెల్లించిన వారికి సదరు మాఫీ మొత్తాన్ని భవిష్యత్తులో చెల్లించే పన్నుల్లో సర్దుబాటు చేయనున్నట్లు వివరించారు. వడ్డీ మాఫీ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. ఆస్తి, ఖాళీ స్థలం పన్నులను నగరపాలక కార్యాలయంలోని పురసేవా కౌంటర్ లో గాని, అన్ని వార్డు సచివాలయాల ద్వారా చెల్లించవచ్చని తెలిపారు.

ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- కపిలేశ్వరస్వామి ఆలయంలో వేడుకలు

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: తిరుపతిలో టీటీడీకి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీకపిలేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతోవైభవంగా ప్రారంభ మయ్యాయి. అర్చకుల వేదమంత్రోచ్చారణ, శంఖనాదాలు, శివనామస్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా జరిగింది. పంచమూర్తులైన శ్రీ సోమస్కంధమూర్తి, శ్రీ కామాక్షి అమ్మవారు, శ్రీ వినాయక స్వామి, శ్రీచండికేశ్వరస్వామి, శ్రీ వల్లి, దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామివారి ఉత్సవమూర్తుల సమక్షంలో ఉదయం 7.40 గంటలకు మీన లగ్నంలో నంది చిత్రంతో కూడిన వస్త్రాన్ని ధ్వజపటానికి చుట్టి ధ్వజస్తంభంపైకి అధిరోహింపచేశారు. కంకణభట్టర్ మణివాసన్ గురుకుల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఏడాదికోసారి ధ్వజస్తంభానికి విశేష అభిషేకం... ధ్వజారోహణంలో భాగంగా మొదట ధ్వజపటం అధిరోహణ, ఆ తరువాత ధ్వజస్తంభానికి అభిషేకం, బలి, నివేదన, దీపారాధన, ఉపచారాలు నిర్వహించారు. ఏడాదికోసారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణం రోజున మాత్రమే ధ్వజస్తంభానికి విశేషంగా అభిషేకం చేస్తారు. పెరుగు, చందనం, విభూది, పన్నీరు, పలురకాల పండ్లరసాలతో వేడుకగా ధ్వజస్తంభానికి అభిషేకం జరిగింది. దీపారాధనలో భాగంగా రథహారతి, నక్షత్రహారతి, సద్యజాతాది దీపారాధన, కుంభహారతి నిర్వహించారు. ఆ తరువాత ఛత్రం, చామరాలు, అద్దం, సూర్యచంద్రులు, విసనకర్ర, ధ్వజంతో ఉపచారాలు చేశారు. అదేవిధంగా రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వాణ వేదాల్లోని మంత్రాలను పఠించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు, కంకణభట్టర్ మణివాసన్ గురుకుల్ మీడియాతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 10 రోజులపాటు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయని తెలిపారు. మార్చి 8న శివరాత్రి పర్వదినం విశేషంగా జరుగనుందని చెప్పారు. మార్చి 9న కల్యాణోత్సవం, మార్చి 10న త్రిశూల స్నానం, ధ్వజావరోహణం జరుగనున్నాయని, భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అనంతరం శ్రీ సోమస్కంద మూర్తి (శివుడు, పార్వతి, సుబ్రహ్మ ణ్యస్వామి), శ్రీ కామాక్షి అమ్మవారికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. పల్లకీపై స్వామి, అమ్మవారు తిరుపతి పురవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, అర్చకులు స్వామినాథ గురుకుల్, ఉదయ గురుకుల్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం రెస్కోలో నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగ అవకాశాలు

- సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ .నాగరాజు

విశాలాంధ్ర -చిత్తూరు: కుప్పం లోని రెస్కో సంస్థలో ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వడంలోనూ ఉద్యోగాలు కల్పించడంలోనూ రెస్కో పాలక వర్గం నిభందనలు గాలికి వదలడం ప్రజాస్వామ్య విరుద్ధమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు విమర్శించారు. సీనియార్టీని తుంగలో తొక్కి చదువుకున్న అర్హతలను కాదని అర్హత లేకపోయినా అధికార పార్టీ పలుకుబడితో, రాజకీయ నాయకుల అండదండలతో ఉద్యోగానికి తగ్గట్టు చదువు ఉండాలని నిబంధనలో ఉన్నప్పటికీ నిబంధనలను ఉల్లగించి అర్హత లేని వారికి ఉద్యోగానికి తగ్గట్టు చదువు లేకపోయినా సీనియార్టీ లేకపోయినా అలాంటి వారికి రేస్కోలో ఉద్యోగం కల్పించడం సరైనది కాదని సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ .నాగరాజు ఆరోపించారు.

ఏ ప్రభుత్వ శాఖలోనైనా పరిపాలనలో ఒక ఉన్నతాధికారి పదవీ విరమణ పొందితే అదే శాఖలో ఉన్న సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వడం ఆ పదవికి తగ్గట్టు చదువు కూడా ఉండడం ఆనవాయితీ కానీ రెస్కో లో మాత్రం దీనికి విరుద్ధంగా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేద రైతులు, పేద కుటుంబాలకు విద్యుత్ వెలుగులు నింపాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రెస్కో పరిపాలన, సంస్కరణల్లో నిరంతరం వివక్ష కొనసాగుతోందని ఆరోపించారు. బైలా నిబంధనను అతిక్రమించి పాలక వర్గం తమకు అనుకూలంగా మార్చుకుని తమ విధేయులకు పట్టం కట్టి తమ పనులు చక్క పెట్టుకునే పనిలో పాలక వర్గం తపన పడుతుందన్నారు.గురువారం పదవీ విరమణ చేసిన ఎం డి సుబ్రమణ్యం స్థానంలో ఏ డి కి కూడా అర్హత లేని అత్యంత జూనియర్ గా విధులు నిర్వర్తించే ప్రభాకర్ కు రెస్కో భాద్యతలు అప్పగించడం దుర్మార్గ చర్య అన్నారు.ఈ విషయం పై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమతుల్యత కలిగిన సమర్థులకు భాద్యతలు అప్పగించాలని సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. వెంటనే పాలక వర్గం, ప్రభుత్వం ఈ విషయం పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

207 పల్స్ పోలియో కేంద్రాలు

- మీడియాతో తిరుపతి కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం(రేపు) నిర్వహించే జాతీయ పల్స్ పోలియో సందర్భంగా 207 పల్స్ పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశామని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో 23 రూట్లలో 207 పల్స్ పోలియో బూతులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఏర్పాటు చేస్తున్న సెంటర్లలో పల్స్ పోలియో వేయబడునని, అదేవిధంగా 4, 5 తేదిల్లో ఇంటింటికి వెల్లి పరిశీలించి ఇంకా ఎవరైనా 5 సంవత్సరాలలోపు పిల్లలు పోలియో చుక్కలు వేసుకోకుండా వుంటె వారికి కూడా వేయడం జరుగుతుందన్నారు. పోలియో వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్క తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకొని తమ ఇంట్లో వున్న ఐదు సంవత్సరాల లోపు చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ కోరారు.

చిన్నశేషవాహనంపై శ్రీ మురళి కృష్ణుడి అలంకారంలో శ్రీ కల్యాణ శ్రీనివాసుడు

విశాలాంధ్ర - చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ఉదయం శ్రీనివాసుడు శ్రీ మురళి కృష్ణుడి అలంకారంలో చిన్నశేష వాహనంపై అభయమిచ్చారు. రెండో రోజు ఉదయం శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడు ఒక్కరే ఐదు తలలు గల చిన్నశేష వాహనాన్ని అధిష్టించారు. చిన్నశేష వాహనం శ్రీవారి వ్యక్తరూపమైన పాంచభౌతిక ప్రకృతికి సంకేతం. కనుక ఈ వాహనం పంచభూతాత్మకమైన విశ్వానికి, అందులో నివసించే జీవునికి వరాలిస్తుంది. విశ్వం కన్పించే శ్రీవారి ప్రకృతి. విష్ణువు ఈ ప్రకృతికి ఆధారమై దాన్ని నడిపించేశక్తి. స్వామి విశ్వాన్ని రక్షించేవాడు కనుక శేషునిపై తానొక్కడే విహరిస్తాడు. పంచశిరస్సుల చిన్నశేషుని దర్శనం మహాశ్రేయః ప్రదం.స్నపన తిరుమంజనం :ఉదయం 10.30 నుండి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపు, చందనంలతో అభిషేకం చేపట్టారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో శ్రీ గోపినాథ్, వైఖానస ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.